
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



అన్నమయ్య
జిల్లా వార్తలు

5

శుక్రవారం 26 జూలై 2024

పోటెత్తిన పెద్దిరెడ్డి భూబాధితులు



రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు భూవివాదాలపై అర్జీలు ఇస్తున్న ప్రజలు

- స్పెషల్ చీఫ్ సెక్రటరీకి వందల సంఖ్యలో ఫిర్యాదులు
- ధైర్యంగా ముందుకొచ్చి బాధ వెళ్లగక్కిన బాధితులు

మదనపల్లె టౌన్, జూలై 25: మా భూమిని ఆక్రమించేశారు, మా స్థలాన్ని కబ్జా చేశారు, ప్రాజెక్టు కోసం మా భూములు బలవంతంగా లాక్కున్నారు, ప్రశ్నిస్తే నడిరోడ్డు మీద ఆడవారు అని కూడా చూడకుండా కొట్టారు...ఇలా ఒకటా రెండా వందల సంఖ్యలో పెద్దిరెడ్డి కుటుంబ బాధితులు మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో తమ గోడు వెల్లబోసుకున్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా ఆధ్వర్యంలో భూవివాదాలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ కార్యక్రమం వర్షం కారణంగా ఆలస్యమైనా, తడుస్తూనే బాధితులు క్యూలో నిల్చుని సిసోడియాకు తమ ఫిర్యాదులు, అర్జీలు అందజేశారు. వీరిలో ఎక్కువగా పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల నుంచి వచ్చిన ప్రజలే ఉన్నారు. అందులో మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వారి అనుచరులైన వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీపీల అరాచకాలను బాధితులు బయటపెట్టారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది, మా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడానికి ఇదే సమయమని ధైర్యంగా సిసోడియా సార్‌కు కంప్లైంట్ ఇవ్వడానికి వచ్చామని బాధితులు చెప్పారు. కాగా వందలాదిగా వచ్చిన ప్రజల నుంచి భూవివాదాలు, ఇతర సమస్యలపై రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఓపికగా అర్జీలు స్వీకరించి, బాధితుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ అర్జీలన్నింటిపై విచారించి నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపుతామని బాధితులకు భరోసా ఇచ్చారు.

ఆడదాన్ని అని కూడా చూడకుండా నడిరోడ్డులో కొట్టారు..



మాది ములకలచెరువు. 2014లో జన్మభూమి కార్యక్రమంలో టీడీపీ ప్రభుత్వం 1.5 సెంట్ల ఇంటి స్థలాన్ని మంజూరు చేసింది. నేను కష్టపడి ఆ స్థలాన్ని చదును చేయించి, ఇటుకలు, ఇసుక తోలిపెట్టాను. ఆర్థిక స్థితి సరిగ్గా లేక ఇంటి నిర్మాణం చేయలేకపోయాను. వైసీపీ ప్రభుత్వం వస్తూనే నాకు ఇచ్చిన స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తుంటే వెళ్లి అభ్యంతరం చెప్పాను, అంతే వైసీపీ నాయకులు వచ్చి నన్ను, నా బిడ్డలను నడిరోడ్డుపై కొట్టారు. అదేమని ఎదురుతిరిగితే తప్పుడు కేసులు పెడతామని బెదిరించారు. ఇప్పటికైనా మాకు న్యాయం జరుగుతుందని సిసోడియా సార్‌కు అర్జీ ఇచ్చేందుకు వచ్చాను.

- తలారి సునీత, ములకలచెరువు

మా భూములు బలవంతంగా లాక్కున్నారు..



పుంగనూరు మండలం నేతిగుంటపల్లె ప్రాజెక్టు కోసం మా గ్రామస్థుల వందలాది ఎకరాల భూములు లాక్కున్నారు. మూడేళ్లు అయినా డబ్బులు ఇవ్వలేదు. ఎన్నికలపుడు ఓట్లేయండి భూమి డబ్బులు ఇప్పిస్తాం, లేకుంటే డబ్బులు రావని పెద్దిరెడ్డి అనుచరులు బెదిరించారు. రైతాంగాన్ని పూర్తిగా మోసం చేశారు. పంట పండే భూముల్లో మన్ను ఎత్తేసి కట్టలు కట్టేసారు. పెద్దపెద్ద టవర్‌లు పాతి మా భూములు ఎందుకు పనికిరాకుండా చేశారు.

- వెంకటరమణ, నేతిగుంటపల్లె రైతు, పుంగనూరు మండలం

వైసీపీ సర్పంచ్‌లు మా భూమిని శ్మశానంగా మార్చేశారు..



నేను ట్రాన్స్‌కోలో లైన్ మ్యాన్‌గా పనిచేస్తున్నాను. సీటీఎం క్రాస్ రోడ్డులో ఎకరాకు పైగా భూమి కొనుగోలు చేశాను. ఈ భూమి చుట్టూ కంచె వేసుకుంటే చూసిన ఇద్దరు వైసీపీ సర్పంచ్‌లు ఆ భూమిని వారికి అమ్మాలని బలవంతం చేశారు. నేను ఇవ్వనని తిరగబడితే, నా భూమిలో ఊర్లో మృతి చెందిన వారి శవాలను పాతి పెట్టించి శ్మశానం చేస్తున్నారు. అప్పట్లోనే మంత్రి, ఎంపీ పేర్లు చెప్పి ఉద్యోగం తీయించేస్తామని బెదిరించారు. ఇప్పటిపైనా నాకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర అధికారికి ఫిర్యాదు చేసేందుకు వచ్చాను.

- ఎ.ఏసువర్ధన్, ట్రాన్స్‌కో ఉద్యోగి, మదనపల్లె

హైకోర్టు తీర్పు ఇచ్చినా మా జాగాను కబ్జా చేసేశారు..



మాది పుంగనూరు టౌన్, ఎంబీటీ రోడ్డులో లాడ్జి పక్కన సర్వే నెంబర్ 16/96లో ఖాళీ జాగా విషయమై హైకోర్టులో కేసు నడిచి మాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయినా మాజీమంత్రి పెద్దిరెడ్డి అనుచరులు దౌర్జన్యంగా మా జాగాను కబ్జా చేసి రోడ్డు వేసేశారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేసినా మాకు న్యాయం జరగలేదు. ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని ఆశగా వచ్చాము.

- పబ్బితి ఉష, పుంగనూరు

నిషేధాజ్ఞలు నీటిపాలు

- గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి చేపల వేట
- వెలిగల్లు జలాశయం నుంచి విచ్చలవిడిగా చేపల తరలింపు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



గాలివీడు, జూలై 25: వెలిగల్లు జలాశయంలో చేపల వేటకు నిషేధం ఉన్నప్పటికీ విచ్చలవిడిగా, అక్రమంగా వేటగాళ్లు చేపలను పట్టుకుని మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. ప్రతి సంవత్సరం జనవరిలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను ప్రాజెక్టులో వదులుతారు. ఈ ఏడాది కూడా వెలిగల్లు ప్రాజెక్టులో 8 లక్షల చేప పిల్లలను వదిలారు. జనవరిలో వదిలిన చేపపిల్లలు జూన్, జూలై నెలల్లో గుడ్లు పెట్టి తిరిగి పిల్లలు విడుదల అవుతాయని మత్స్యశాఖ అధికారులు పేర్కొన్నారు. కావున ప్రతి ఏడాది జూన్, జూలై నెలల్లో వెలిగల్లు ప్రాజెక్టులో చేపలు పట్టడాన్ని నిషేధించారు. ఇందులో భాగంగా జూలై 1న వెలిగల్లు ప్రాజెక్టులో చేపలు పట్టడాన్ని నిషేధిస్తూ మత్స్య పరిశ్రమ అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. తల్లి చేప ప్రస్తుతం గుడ్డు దశలో ఉంటుందని, జూన్, జూలై రెండు నెలలు ఎవరూ చేపల వేట కొనసాగించరాదని నిషేధాజ్ఞలు జారీ చేశారు. రెండు నెలల కాలం చేపల పునరుత్పత్తికి అవకాశం ఉంటూ భవిష్యత్తులో జాలర్ల జీవనోపాధికి భరోసా కల్పించడమే నిషేధం ముఖ్య ఉద్దేశ్యం. అయితే కొంతమంది స్వార్థం కోసం నిషేదాజ్ఞలను ఉల్లంఘించి గుట్టుచప్పుడు కాకుండా రాత్రుల సమయంలో చేపలను వేటాడుతున్నారు. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది వెలిగల్లులో రాత్రుల్లో ప్రాజెక్టులో వలలు వేసి చేపలను పట్టి సమీపంలోని గాలివీడు, ఎన్‌పీ కుంట, కదిరి తదితర పట్టణాల్లో విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ క్వింటాల్ చొప్పున చేపలను పట్టుకుని సమీపంలోని పట్టణాల్లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా వెలిగల్లు ప్రాజెక్టులో మంచి రుచికరమైన చేపలు లభిస్తాయి. ప్రతిరోజూ గాలివీడు పట్టణంలోనే వందల కేజీలు చేపలు అమ్ముడుపోతున్నాయి. అంటే వీళ్లు ఎక్కడ నుంచి పట్టి తీసుకొస్తున్నారు అనేది అందరికీ తెలిసిన బహిరంగ విషయమే. చుట్టుపక్కల చేపలు లభించే చెరువులు కానీ, కుంటలు కానీ లేవు. కేవలం ఒక వెలిగల్లు ప్రాజెక్టులో మాత్రమే లభిస్తాయి అని కొంత మంది ప్రజలు తెలుపుతున్నారు.

నిషేధాజ్ఞలు ఉల్లంఘించే వారిపై చర్యలు

జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు వెలిగల్లు జలాశయంలో ఎవరూ చేపలు పట్టరాదని నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఎవరైనా వాటిని ఉల్లంఘించి చేపలను వేటాడితే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తాము. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎవ్వరూ చేపలను వేటాడలేదు. ఎక్కడైనా చేపలను పట్టుకుని వచ్చి మండల కేంద్రంలో విక్రయిస్తూ ఉంటారు. మేమే ప్రతిరోజూ వెలిగల్లు ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్నాము. అంతేగాక పోలీసులకు కూడా ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చి చేపల వేట కట్టడికి చర్యలు తీసుకుంటున్నాము.

- రామాంజులునాయక్, విలేజ్ ఫిషనరీ అసిస్టెంట్, గాలివీడు

ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు ముగిసిన కౌన్సెలింగ్

వేంపల్లె, జూలై 25: మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఒంగోలు ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్ కౌన్సెలింగ్ గురువారం ముగిసింది. రెండవ రోజు డైరెక్టర్లు కుమారస్వామి గుప్త, భాస్కర్‌పటేల్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. మొత్తం 1035 మందికి కాల్‌లెటర్లు పంపగా 792 మంది హాజరై అడ్మిషన్లు పొందారు. మిగిలిన 242 సీట్లకు ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సంద్ర తెలిపారు

లంకమలలో కూంబింగ్

సిద్దవటం, జూలై 25 : సిద్దవటం మండలం లంకమల అటవీ ప్రాంతంలోని ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగే ప్రాంతాల్లో రెండు రోజులుగా కడప ఫ్లయింగ్ స్క్వాడ్, సిబ్బంది, సిద్దవటం రేంజి సిబ్బంది కలిసి రెండు స్పెషల్ టీములుగా ఏర్పడి కూంబింగ్ చేస్తున్నారు. సిద్దవటం రేంజిలో 4 బీట్‌లలోని ప్రదేశాలలో కడప జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌ఆర్‌వో నయామ్ అలీ, సిద్దవటం ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి, డిప్యూటీ రేంజి అధికారి ఓబులేశు ఆధ్వర్యంలో కూంబింగ్ చేస్తున్నారు. ఎక్కడా ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఆనవాళ్లు కనిపించలేదని, ఈ కూంబింగ్ మరికొన్ని రోజులు కొనసాగుతుందని రేంజ్ అధికారులు తెలిపారు. కూంబింగ్‌లో ఫ్లయింగ్‌స్క్వాడ్ ఎఫ్‌ఎస్‌వో సి.నాగరాజు, గొల్లపల్లె ఎఫ్‌బీవో పెంచలరెడ్డి, బేస్ క్యాంపు సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్స్ తదితరులు పాల్గొన్నారు.

లంకమలలో కూంబింగ్ చేస్తున్న అటవీ అధికారులు



రికార్డులు భద్రపరచడంలో నిర్లక్ష్యం తగదు

- తేడా వస్తే బాధ్యులవుతారు
- రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా

మదనపల్లె టౌన్, జూలై 25: ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖకు చాలా ప్రాధాన్యత ఉంది. అలాంటి చోట రెవెన్యూ ఉద్యోగులు విధినిర్వహణలో బాధ్యతగా పనిచేస్తూనే రికార్డుల నిర్వహణలో శ్రద్ధ చూపాలని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా ఆదేశించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 60 మండలాల తహసీల్దార్‌లతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులను భద్రపరచడంలో నిర్లక్ష్యం చేస్తే దానికి బాధ్యులవుతారని హెచ్చరించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అధికారులు వారి పరిధిలోని రెవెన్యూ అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతుల అనుభవంలో భూమి ఉన్నా 20 ఏళ్లు కాకుండానే వారికి డీకేటీ పట్టా ఇవ్వరాదన్నారు. ఇలాంటివి ఇప్పటికే మంజూరై ఉంటే వారిపై సర్వే చేయించాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన 22(ఏ) భూసమస్యలు, గత ఏడాది నిర్వహించిన పట్టా భూముల వివరాలు, ల్యాండ్ కన్వర్షన్ ప్రక్రియ, చుక్కల భూముల వివరాలు, అసైన్‌మెంట్ భూముల సమస్యలను ఆయా డివిజన్‌ల ఆర్డీవోలు, సబ్‌కలెక్టర్‌ల దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాకే సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు శ్రీధర్, సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఉమ్మడి చిత్తూరు జిల్లా తహసీల్దార్లకు సూచనలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా

రిజిస్ట్రేషన్లను తనిఖీ చేసిన స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ

మదనపల్లె టౌన్, జూలై 25: మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గత ఏడాది నిర్వహించిన భూముల రిజిస్ట్రేషన్‌లలో 22(ఏ) ఎన్‌వోసీ పొందిన భూముల వివరాలను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ సరోజదేవి పరిశీలించారు. గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది పనితీరు, రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్స్, రికార్డు రూమును ఐజీ తనిఖీ చేశారు. వర్షం వస్తే రికార్డు రూము ఉరుస్తోందని సిబ్బంది ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కొన్ని రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి ఆన్‌లైన్ డాక్యుమెంట్లను తీసుకుని సబ్ కలెక్టరేట్‌కు వెళ్లి అక్కడ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో కడప డీఐజీ శివరామ్, జిల్లా రిజిస్ట్రార్ మునిశంకరయ్య, సబ్ రిజిస్ట్రార్ పి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ సరోజదేవి

సీఐడీ చీఫ్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు ముమ్మరం

- మదనపల్లెలో సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ మకాం

మదనపల్లె టౌన్, జూలై 25: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనంపై నమోదైన కేసును సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరంగా జరుగుతోంది. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కడప జిల్లాల నుంచి వచ్చిన సుమారు 60 మంది సీఐడీ అధికారులు బృందాలుగా విడిపోయి ఇటు సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులను విచారిస్తుండగా, మరికొందరు మాధవరెడ్డి, స్నేహితులు, బంధువులు, పనివాళ్ల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఏమైనా రెవెన్యూ రికార్డులు ఉన్నాయా లేదా అనే కోణంలో వీఆర్‌వోల సహకారంతో తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు ఫైళ్ల దహనం తరువాత మిగిలిన వస్తువులు, సగం కాలిపోయిన ఫైళ్ల శాంపిల్స్‌ను తీసుకుని ఫోరెన్సిక్ సైన్సు ల్యాబ్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు ఆధారంగా కేసు దర్యాప్తు మరింత పురోగతి సాధిస్తుందని తెలుస్తోంది. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చెప్పినట్లు 37 మంది అనుమానితులు(ఉద్యోగులు)తో పాటు, కాల్‌డేటా ఆధారంగా బయట ఉన్న వ్యక్తుల గురించి కూడా సీఐడీ పోలీసులు ఆరా తీస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్న ఈ కేసులో ఎలాంటి పొరపాట్లు లేకుండా చిన్న విషయాలను కూడా పరిగణలోకి తీసుకుని కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అనాథలా సబ్ కలెక్టర్ కార్యాలయం

- నాడు రాష్ట్రంలోనే రాజసం.. నేడు ఉనికినే కోల్పోయి...
- 1984లో కాలిపోయిన రికార్డులతో అస్తవ్యస్తంగా రెవెన్యూ డివిజన్
- వేల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా
- ఏమీ చేయలేని స్థితిలో నేటి రెవెన్యూ అధికారులు

రాజంపేట, జూలై 25: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ భవనాన్ని, రికార్డులను కాల్చివేసిన సంఘటన నేడు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఎంతో ఘన చరిత్ర కలిగిన రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం గురించి ఒకసారి పరిశీలిస్తే... సుమారు 18 ఎకరాల సువిశాల మైదానంలో రాజంపేట పట్టణం నడిబొడ్డున పచ్చని చెట్ల మధ్య రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం 1905లో బ్రిటీష్ కాలంలో అంకురార్పణ జరిగినా 1916లో డివిజన్ కార్యాలయం పూర్తిస్థాయిలో ఏర్పాటైంది. రాజంపేట డివిజన్‌లోని 17 మండలాలకు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏర్పాటైంది. కుక్కలదొడ్డి నుంచి కలసపాడు వరకు ఎంతో సుందరమైన సహజ వనరులు, కావాల్సిన అటవీ ప్రాంతం, భూగర్భ సంపద, ఎక్కడ చూసినా వ్యవసాయం ఈ డివిజన్ పరిధిలో ఉండేవి. అన్నిటికంటే మించి ప్రభుత్వ భూములు అధికంగా ఉన్న డివిజన్‌గా పేరు ఉండేది. నాడు రాజంపేటలో సబ్‌కలెక్టర్‌లుగా పనిచేసి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ హోదా వరకు వెళ్లి రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వన్నె తెచ్చిన ఎంతోమంది ఐఏఎస్ అధికారులు ఉన్నారు. వారిలో ఎంఎస్ రాజాజీ, సీఎస్ రంగాచారి, సతీష్‌నాయర్, మినీమాథ్యూ, అరోరా, పీఎల్ శివరాం లాంటి గొప్ప ఐఏఎస్ అధికారులు ఇక్కడ పనిచేశారు. అనంతరం ఆర్డీవోలుగా పనిచేసి తదనంతరం ఐఏఎస్ అధికారులై రాజంపేటకు వన్నె తెచ్చిన ఉదయలక్ష్మీ, వెంకటరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటరమణారెడ్డిలు ఇక్కడ పనిచేసి ఎంతో పేరు ప్రతిష్టలు గడించారు. ఆ సమయంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం అంటే గొప్ప గౌరవ చిహ్నంగా భావించేవారు. కారణం ఆనాటి రెవెన్యూ ఉన్నతాధికారులు అంకితభావంతో పాటు వృత్తిని దైవంగా భావించే గుణం కలిగి ఉండేవారు.

రెవెన్యూ రికార్డుల గది అంటే ఎంతో ప్రత్యేకత

రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలోని గతంలో రెవెన్యూ రికార్డుల గదికి ఎంతో ప్రాధాన్యత ఉండేది. ఎంతో పటిష్టంగా ఈ రికార్డు గదిని చూసుకునేవారు. ప్రత్యేక సిబ్బంది అక్కడ ఉండేవారు. ఈ రెవెన్యూ రికార్డు గదిని ప్రత్యేక రెవెన్యూ భాండాగారంగా భావించేవారు. ఈ గదిలో అత్యంత కీలకమైన ఆర్డిస్ ఫైల్ అనగా శాశ్వత ఫైళ్లు ఏర్పాటు చేసేవారు. ఈ శాశ్వత ఫైళ్లల్లో తరతరాలకు ఉపయోగపడే ఫైళ్లను అక్కడ ఉంచేవారు. అక్కడే పదేళ్ల నుంచి 20 ఏళ్ల వరకు ఉపయోగపడే డీడిస్పోజల్ అనగా డీకేటీ, ఆయకట్టు, బంజరు భూములు, వాటికి సంబంధించిన ఫైళ్లు ఉంచేవారు. ఎల్ డిస్పోజల్‌కు సంబంధించి అనగా ఒక ఏడాదిలో పరిష్కారమయ్యే సమస్యలకు సంబంధించిన ఫైళ్లను అందులో ఉంచేవారు. ఈ ఫైళ్ల ద్వారా ఎంతో పని నేర్చుకునేవారు. ఏ అధికారి మారినా రికార్డు గదిలో ఉన్న ఫైళ్ల ద్వారా కచ్చితమైన సమాచారం లభించేది. తద్వారా అవకతవకలు జరిగేవి కావు.

ఏడాదికోసారి ఫైళ్ల పరిశీలన

బ్రిటీష్ కాలం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల గదిని సంబంధిత జిల్లా కలెక్టర్‌లు ఏడాదికొకసారి తనిఖీ చేసేవారు. తనిఖీల సమయంలో కలెక్టర్‌లు ఎంతో నిక్కచ్చిగా ఉండేవారు. ఉదాహరణకు ఉదయలక్ష్మీ అనే ఆర్డీవో 1989లో రాజంపేట ఆర్డీవోగా ఉన్నప్పుడు ఆమె నిండు గర్భిణీ. శరీరం సహకరించకపోయినా రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిధిలోని రికార్డులతో పాటు 17 మండలాల్లోని రెవెన్యూ తనిఖీ చేసి తన వృత్తి ధర్మాన్ని చాటుకున్నారు. అదేవిధంగా గత ఐఏఎస్ అధికారి రమణాచారి, సుబ్రమణ్యం నిక్కచ్చిగా రెవెన్యూ రికార్డులను తనిఖీ చేసేవారు. అటువంటిది ఏమైందో ఏమోకాని రానురాను రికార్డుల తనిఖీ పూర్తిగా అటకెక్కింది.

సబ్‌కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాలు కాల్చివేత

1984 సంవత్సరం ఆగస్టు 17వ తేదీ నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బర్తరఫ్ అయినప్పుడు కొందరు ఆకతాయిలు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని, తహసీల్దార్ కార్యాలయాన్ని ఇతర కార్యాలయాలను కాల్చివేశారు. దీంతో సబ్‌కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లోని రెవెన్యూ రికార్డులు పూర్తిగా బూడిదపాలయ్యాయి. దీంతో 17 మండలాల రెవెన్యూ రికార్డులు బూడిదపాలయ్యాయి. ఆనాటి నుంచి రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ రాజసం, గౌరవం మాయమైపోయాయి. దీనిని సాకుగా చూసుకుని కొందరు రెవెన్యూ అధికారులు తమకు ఇష్టమొచ్చినట్లు అవినీతికి పాల్పడి భూరికార్డులన్నీ తారుమారు చేశారు. ఈ 17 మండలాల్లోని రెవెన్యూ వ్యవస్థ అంతా కబ్జాదారుల పాలైంది. ఎవరికి ఇష్టమొచ్చినట్లు రికార్డులు మార్చుకుని కొత్త రికార్డులు సృష్టించుకుని ప్రభుత్వ భూములను వేలాది ఎకరాలు కబ్జాదారులు ఆక్రమించుకున్నారు.

పాత భవనంలోనే సబ్‌కలెక్టర్ కార్యాలయం

పైన పటారం.. లోన లొటారమన్న చందంగా నేడు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం మారిపోయింది. 17 మండలాలతో విరాజిల్లిన ఈ కార్యాలయం రెవెన్యూ డివిజన్ల పునర్ వ్యవస్థీకరణలో 11 మండలాలకే తగ్గిపోయింది. పాత భవనంలోనే కార్యాలయం అనాథలా కొనసాగుతోంది. నేడు ఒక గ్రామ సచివాలయాన్ని చూస్తే దానికున్న హంగులు, ఆర్భాటాల్లో 10 శాతం కూడా రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయానికి లేవు. విశాలమైన వాతావరణంలో పచ్చని చెట్ల మధ్య కనీసం భద్రత కల్పించలేని పాత కాంపౌండ్, ముళ్లచెట్ల మధ్య బిక్కు బిక్కుమంటూ ఈ కార్యాలయం ఉంది. ఒక సబ్ కలెక్టర్, ఒక సూపరింటెండెంట్, ఇరువురు సీనియర్ అసిస్టెంట్‌లు, ఇరువురు జూనియర్ అసిస్టెంట్‌లు, కొందరు అటెండర్లతో కాలం గడుపుతోంది. రాత్రివేళ వాచ్‌మెన్ సౌకర్యం కూడా లేదు. బ్రిటీష్ కాలం నుంచి నేటివరకు ఈ సబ్ కలెక్టర్ కార్యాలయ భద్రతను రాత్రివేళ పర్యవేక్షించే వాచ్‌మెన్ పోస్టు కూడా నాటి నుంచి నేటివరకు కూడా లేకుండాపోయింది. కేవలం ఉన్నతాధికారి ఆదేశాలతో అనధికారికంగా రాత్రివేళ ఒకరో ఇద్దరు వీఆర్ఏలతో కాపలా ఉండాల్సి వస్తోంది. అంతే తప్ప దీనిని పట్టించుకునేవారు లేకుండాపోయారు. ఒక్క మాటలో చెప్పాలంటే అత్యున్నత సబ్ కలెక్టర్ కార్యాలయం ఓ అనాథలా మారిపోయింది.



రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం కాంపౌండ్‌వాల్ దూకి వస్తున్న ఆకతాయి



ఒక చిన్నపాటి పాత భవనంలో బిక్కు బిక్కుమంటూ కొనసాగుతున్న రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన భవనం



కనీస భద్రత లేక పిచ్చిమొక్కల మధ్య దౌర్భాగ్యంగా ఉన్న రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ రికార్డు గది వెనుకభాగం



సబ్‌కలెక్టర్ పరిపాలనా కార్యాలయం

రెండేళ్లుగా.. రెవెన్యూ రికార్డులు లేక..!

- పరిష్కారం కాని సమస్యలు
- చేతులెత్తేసిన మండలాల అధికారులు
- ఆందోళనలో రైతులు, ప్రజలు
- ఆర్డీవో కార్యాలయంలో చిరుద్యోగి చేతివాటం

బద్వేల్ రూరల్, జూలై 25: రైతులకు సంబంధించిన భూములు, పేదల ఇంటి పట్టాలు వంటి ఎన్నో పత్రాలు రెవెన్యూ కార్యాలయంలో నిక్షిప్తమై ఉంటాయి. రైతులకు భూమి సమస్యలు వచ్చినా, పేదల ఇంటి పట్టాల సమస్యలు ఉన్నా సంబంధిత రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేస్తే.. ఆ అధికారి ధ్రువీకరణ ఆధారంగా సమస్యలు పరిష్కరమవుతాయి. అయితే బద్వేల్ రెవెన్యూ డివిజన్‌లో బద్వేల్ నియోజక వర్గానికి సంబంధించి ఏడు మండలాల్లో రెవెన్యూ రికార్డులు లేవు. దీంతో ఆయా మండలాల రెవెన్యూ కార్యాలయాల్లోకి ఏ బాధితుడు వెళ్లినా సమ్యలు పరిష్కారం కావడం లేదు. మా కార్యాలయంలో రికా ర్డులు లేవంటూ అధికారులు నేరుగా ఫిర్యాదుదారులకు చెప్పడం శోచనీయం.

రికార్డులన్నీ ఆర్డీవో కార్యాలయంలో..

బద్వేల్, గోపవరం అట్లూరు, పోరుమామిళ్ల, బి.కోడూరు, కలసాపాడు, కాశినాయన మండలాల్లో రెవెన్యూ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల్లోని రికార్డులన్నీ ఆర్డీవో కార్యాలయంలో ఉన్నాయని సమాచారం. బద్వేల్ రెవెన్యూ డివిజన్ అయిన తరువాత మొదటి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన ఆకుల వెంకటరమణ నియోజకవర్గంలో ప్రధానంగా నెలకొన్న భూ వివాదాలపై దృష్టి సారించారు. నకిలీ పట్టాల తయారు చేసే ముఠాపై ఉక్కుపాదం మోపి.. కేసులు పెట్టి జైళ్లకు పంపారు. ఆ సమయంలో రికార్డులన్నీ ఆర్డీవో కార్యాలయానికి చేర్చాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అప్పటి నుంచి అంటే.. రెండేళ్లుగా రెవెన్యూ రికార్డులన్నీ ఆర్డీఓ కార్యాలయంలోనే ఉన్నాయి.

సమస్యల పరిష్కారం ఎలా...

నకిలీ పట్టాల కేసు విషయమై ఏడు మండలాల్లోని రెవెన్యూ రికార్డులన్నీ ఆర్డీఓ కార్యాలయానికి చేరి దాదాపు రెండేళ్లు దాటింది. అయితే ఇప్పటి వరకు ఏ కార్యాలయానికి రికార్డులు తిరిగి అందలేదు. దీంతో రెవెన్యూ కార్యాలయాల పరిధిలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించలేకపోతున్నారు. నకిలీ పట్టాల కేసు ఎప్పుడో ముగిసిపోయినప్పటికీ.. ఇంత వరకు రికార్డులు కార్యాలయాలకు చేర్చకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చిరుద్యోగి చేతి వాటం..

ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న ఏడు మండలాల రికార్డులతో గతంలో ఓ చిరుద్యోగి చేతి వాటం ప్రదర్శించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం కూడా మరో చిరుద్యోగి



బద్వేల్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం

రికార్డులతో చేతివాటాన్ని ప్రదర్శించి సమస్యలతో వచ్చిన బాధితుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అప్పటి ఆర్డీఓ బదిలీపై వెళ్లి.. మరో ఇన్‌చార్జి ఆర్డీఓ బాధ్యతలు చేపట్టిన తరుణంలో రెవెన్యూ కార్యాలయాలకు రికార్డులు చేర్చి సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఆర్డీవో ఆఫీసుకు సరెండర్ చేశాం..

రెండు సంవత్సరాల క్రితం నకిలీ పట్టాల కేసు విషయంలో డీకేటీ పట్టాలు, ఇంటి పట్టాలకు సంబంధించిన రికార్డులన్నీ ఆర్డీవో ఆఫీసుకు సరెండర్ చేశాం. ప్రస్తుతం రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు లేవు.

- మనోహర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు, బద్వేలు

భూ కబ్జాలపై విచారణ చేపట్టాలి : సీపీఐ

బద్వేలు, జూలై 25: వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఆ పార్టీ నేతలు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. భూకబ్జాలపై విచారణ చేపట్టి.. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ గురువారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి.. ఆర్డీఓ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ వైసీపీ హయాంలో కాశినాయన మండలం నుంచి అట్లూరు మండలం వరకు సుమారు 30 వేల ఎకరాలు కబ్జా చేసి బినామీ పేర్లతో నకిలీ పట్టాలతో అక్రమంగా ఆన్‌లైన్ కూడా చేయించుకున్నారన్నారన్నారు. రీ సర్వే పేరుతో వేలాది ఎకరాలు రాత్రికి రాత్రే తారుమారు చేశారని, తక్షణం కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కాశినాయన మండలంలోని 55, 106, 121, 130, 132, 133తో పాటు అనేక సర్వే నెంబర్లలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి 250 ఎకరాలు బినామీ పేర్లతో పట్టాలు సృష్టించి ఆన్‌లైన్ కూడా చేయించుకున్నారన్నారు. కలసపాడు మండలం రామాపురంలో భూ ఆక్రమణలు జరిగాయన్నారు. పోరుమామిళ్ల మండలం పోరుమామిళ్ల, రామేశ్వరం, పెద్దచెరువు, యల్లారెడ్డిపేట, క్రిష్టంపల్లి చెరువులను ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారన్నారు. బద్వేలు, గోపవరం మండలాల్లోని గోపవరం తహసీల్దారు కార్యాలయం ఎదురుగానే 64, 65, 119/ఎ,బి సర్వేనెంబర్లలో నకిలీ పట్టాలు పొందికోట్ల రూపాయలు విలువైన భూములను ఆక్రమించారన్నారు. మడకలవారిపల్లె, బద్వేలు మండలంలోని సి.కొత్తపల్లె, అట్లూరు మండలం కొండూరు తదితర ప్రాంతాల్లో వైసీపీ హయాంలో భారీ ఎత్తున ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని.. వాటిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, రమణ, ఇమ్మానుయేల్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

కౌలు సాగుకు కార్డు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్



ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న చంద్రానాయక్

రామాపురం, జూలై 25: భూమి కౌలుకు తీసుకొనే రైతులు పంటలు సాగు చేసుకునేందుకు పత్రం, కార్డు తప్పనిసరిగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె వ్యవసాయ క్షేత్రంలో గురువారం రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసుకునే రైతులు కార్డు పొంది ఉంటే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతాయన్నారు. పీయం కిసాన్ పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఈకేవైసీ పూర్తి చేయించాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించి.. సాగురైతుల సంఖ్యను పెంచి పనితీరును మెరుగుపర్చాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం పొలంలో ఆయన సందర్శించి లింగాకర్షక బుట్టలు, పసుపు పల్లెముల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత సమాజం నిర్మించుకుందాం..

- యువతను చైతన్యం చేయడం అభినందనీయం - కలెక్టర్



పోస్టరు ఆవిష్కరణ చేస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 25 : గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య ముద్రించిన ఓ యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడదాం అనే పోస్టరును కలెక్టర్ లోతేటి శివశంకర్ గురువారం ఆవిష్కరించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడంలో యువత భాగస్వామ్యం కావాలని జీఆర్ఎస్‌వైఎఫ్ యువ తను చైతన్యం చేయడం అభినందనీయమన్నారు. నేటి ఆధునిక సమాజంలో అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన యువత మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారన్నారు. ఇది ప్రస్తుత సమాజానికి ప్రమాదకరమన్నారు. డ్రగ్స్‌రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. జీఆర్ఎస్‌వైఎఫ్ డీఎం ఓబులేసుయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిక్, సాయి, నవీన్, నాగమల్లేశ్, హరి పాల్గొన్నారు.

వైవీయు ఆర్ట్స్ విభాగ డీన్‌గా ప్రొఫెసరు గంగయ్య

కడప (ఎడ్యుకేషన్), జూలై 25: యోగివేమన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ విభాగ డీన్‌గా చరిత్ర పురావస్తుశాఖ ప్రొఫెసర్‌గా కంకణాల గంగయ్య నియమితులయ్యారు. నియామకపు పత్రాన్ని వైవీయు వీసీ ఆచార్య కె.క్రిష్ణారెడ్డి, కుల సచివులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డితో కలిసి తన ఛాంబరులో అందించారు. ఇది వరకు డీన్‌గా పనిచేస్తున్న తెలుగుశాఖ ఆచార్యులు టి.రాంప్రసాద్‌రెడ్డి పదవీ కాలం పూర్తవడంతో ఈ నూతన నియామకం చేపట్టారు. ఆచార్య కంక ణాల గంగయ్యను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

పోయిన నగదు బాధితులకు అప్పగింత

నందలూరు, జూలై 25: పోయిన నగదును బాధితులకు పోలీసు లు అప్పగించిన సంఘటన గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈసం ఘటనపై ఎస్ఐ మహ్మద్ అబ్దుల్‌జహీర్ మాట్లాడుతూ కడపకు చెందిన మల్లు దివాకర్ తిరుపతి నుంచి కడపకు వెళుతూ నందలూరులో టీ తాగేందుకు దిగుతుండగా.. రూ.90 వేల నగదు ఉన్న పర్సు కింద పడిపోయింది. అది గమనించనివారు కడపకు వెళ్లి చూసుకోగా పర్సు కనపడకపోవడంతో నందలూరుకు వచ్చి పోలీసులను ఆశ్రయించారు. వారు సీసీ కెమెరాలు పరిశీలించి ఒక వ్యక్తికి ఆపర్సు దొరికినట్లు నిర్ధారించారు. అతనిని నుంచి నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మలమడుగు, జూలై 25: జమ్మలమడుగులో పలు గ్రామాల నుంచి రాత్రి, పగలు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పట్టణంలో అర్బన్ పోలీసు సిబ్బంది నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. అర్బన్ పోలీసు స్టేషన్‌కు తరలించి.. చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు అప్పజెబుతున్నట్లు ఏఎస్ఐ మురళీయాదవ్ తెలిపారు.

46 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



సంచులు మార్చి లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని లక్కిరెడ్డిపల్లె గోడౌన్‌లో దించుతున్న వైనం

లక్కిరెడ్డిపల్లె/రామాపురం, జూలై 25: రామాపురం మండలంలోని గువ్వలచెరువు చెక్ పోస్టువద్ద పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించి.. బద్వేల్ నుంచి కర్ణాటకకు తరలిస్తున్న రెండు లారీల్లోని 46 టన్నుల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని లక్కిరెడ్డిపల్లె నిత్యావసర సరుకుల గోడౌన్‌కు తరలించారు. జిల్లా మేనేజర్ శ్రీనివాసమూర్తి, డీఎస్ఓ రఘురాంలు సంఘటనా స్థలానికి చేరుకొని విషయంపై ఆరా తీశారు.

ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని గోనే సంచుల నుంచి మార్చి ప్లాస్టిక్ సంచులలో తరలిస్తున్నారని సమాచారం రావడంతో రామాపురం ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. బద్వేల్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తుండగా 850 బస్తాల రేషన్ బియ్యాన్ని, రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ కృపావతి తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని గోపగుడిపల్లె గ్రామ వీఆర్వో చిన్నసాగర్, ఎన్‌ఫోర్స్ మెంటు డీటీ కృపావతి లక్కిరెడ్డిపల్లె గోడౌన్‌కు తరలించి తూకాలు వేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రామాపురం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ.. బ్యాంకు అసిస్టెంటు మేనేజరు మృతి

కడప (క్రైం), జూలై 25 : కడప నగరం శంకరాపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సెంట్రల్ బ్యాంకు అసిస్టెంటు మేనేజరు గిద్దలూరు వెంకటరమణ (44) మృతి చెందాడు. చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ వివరాల మేరకు.. కడప నెహ్రూనగర్‌కు చెందిన వెంకటరమణ కడపలోని సెంట్రల్‌బ్యాంకు అసిస్టెంటు మేనేజరుగా పనిచేస్తున్నాడు. మృతుడు అంధుడు అని.. సొంత పని నిమిత్తం కూతురుతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా శంకరాపురం వద్ద టర్నింగ్ తీసుకుంటుండగా మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయనను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కడప (క్రైం), జూలై 25 : కడప నగరం ఆర్టీసీ బస్టాండు వద్ద 24న బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి వయసు 50 సంవత్సరాలు ఉంటుందని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే 9121100520, 9121100521 సెల్ నెంబర్లకు ఫోను చేసి సమాచారం అందించాలని సీఐ నరసింహారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

సికెదిన్నె, జూలై 25: మండలంలోని వేపమాను సత్రం వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుకవైపు నుంచి ఢీకొనడంతో రాజేంద్రన్ ధర్మలింగం (50) అనే వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. వివరాలిలా.. తమిళనాడు రాష్ట్రం ఏలూరు జిల్లా పల్లికొండ గ్రామానికి చెందిన రాజేంద్రన్ మరో డ్రైవర్ హరికిషన్‌తో కలిసి మహారాష్ట్రకు వెళ్లి..తిరిగి ఏలూరుకు వస్తుండగా గురువారం తెల్లవారుజామున ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురు కళ్లలో పడటంతో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దీంతో రాజేంద్రన్ ధర్మలింగం రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. 108లో రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైవీయూ ప్రొఫెసర్‌కు ప్రతిష్టాత్మక బ్రెయిన్ పూల్ ఫెలోషిప్



ప్రొఫెసర్ ఎంవీ శంకర్‌ను అభినందిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు రఘునాథరెడ్డి తదితరులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 25: నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆఫ్ కొరియా 2024 అత్యుత్తమ విదేశీ పరిశోధకులకు అందించే బ్రెయిన్‌పూల్ ఫెలోషిప్ వైవీయూ మెటీరియల్స్ సైన్స్ నానోటెక్నాలజీ ప్రొఫెసరు ఎంవీ శంకర్‌కు లభించింది. దక్షిణ కొరియాలోని ప్రపంచ ర్యాంకింగ్ సంస్థ కొంకుక్ యూనివర్శిటీలో పనిచేయడానికి ఈయనను ఆహ్వానించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 81 మంది సభ్యుల్లో ఆయన ఒకరు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ రఘునాథ రెడ్డి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయం నుంచి యువ అధ్యాపకులు ప్రపంచ ప్రతిష్టాత్మక ఫెలోషిప్ పొందడం ప్రశంసనీయం అన్నారు. విశ్వవిద్యాలయం పరిశోధనలు చేయడానికి అవసరమైన సమగ్ర సహాయాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. కాగా, వైవీయూ ప్రొఫెసరు శంకర్ పరిశోధన, అకడమిక్ ఆధారంతో పాటు అంతర్జాతీయ శాస్త్రీయ సమాజంలో అత్యుత్తమ ప్రభావవంతమైన శాస్త్రవేత్తల్లో ఒకరిగా గుర్తింపు పొం దారు. అతను 2020, 21, 22, 23 సంవత్సరాల్లో మెటీరియల్స్ అండ్ ఎనర్జీ రంగంలో ప్రపంచంలోని మొదటి ఇద్దరిలో అత్యంత ప్రభావంతమైన శాస్త్రవేత్తల జాబితాలో నిలిచారు. పరిశోధనలకు గుర్తింపుగా వివిధ శాస్త్రీయ సంస్థల నుంచి గ్రాంట్లు లభించాయి. 2022 సంవత్సరం యూకే (ఎఫ్ఆర్ఎస్‌సీ)లో ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ పురస్కారం అందుకున్నారు. స్కోపస్ ఇండెక్స్ జర్నల్స్‌లోని పరిశోధన ప్రచురణ ఆధారంగా గత నాలుగేళ్లలో ఈయన అద్భుతమైన పరిశోధన పత్రాలు రాశారు. ముఖ్యంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, కాలుష్య కారకాల క్షీణత, స్థిరమైన వాతావరణం పరిశోధనలతో ప్రతిష్టాత్మకమైన అవార్డులతో పాటు ఆచార్య శంకర్‌కు ప్రత్యేక గుర్తింపును సంపాదించి పెట్టాయి. కార్యక్రమంలో డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, సీఈ ఆచార్య ఎన్ ఈశ్వర్‌రెడ్డి, ఆచార్య ఎజీ దాము, ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి, సహా ఆచార్యులు డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ శ్రీధర్‌బాబు, అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ టి.సురేశ్‌బాబు పాల్గొన్నారు.

కార్గిల్ ద్వారా పాకిస్థాన్ పీచమణిచిన భారత్

- బీజేపీ, బీజేవైఎం నాయకులు




కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

కడప (మారుతీనగర్), జూలై 25: భారత్‌లో అంతర్భాగమైన కాశ్మీర్‌ను రక్షించుకునే క్రమంలో శత్రుదేశ పాకిస్థాన్‌ను పీచమణిచేవిధంగా 25 సంవత్సరాల క్రితం జరిగిన కార్గిల్ యుద్ధంలో మన సైన్యం నిరూపించిన సంగతి తెలిసిందే అని బీజేపీ, బీజేవైఎం నాయకులు అన్నారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళి అర్పించే క్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా బీజేవైఎం పిలుపుమేరకు కాగడాల ప్రదర్శన చేపట్టారు. అందులో భాగంగా బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణయాదవ్, బీరం సుబ్బారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ మాట్లాడారు. కాశ్మీర్‌లో అంతర్భాగమైన కార్గిల్‌ను పాకిస్థాన్ ఆక్రమించుకునేందుకు సాగినపోరులో భారత్ 1999లో తిరుగులేని విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, మునగా సతీష్‌కుమార్, ఓబులేసు, డాక్టర్ జయశ్రీనివాస్, బీజేవైఎం నగర అధ్యక్షుడు మాచునూరు హరికృష్ణ, నాయకులు రంగప్రసాద్, అమర్‌నాథ్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

మాట్లాడుతున్న అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత గంగిరెడ్డి, హాజరైన విద్యార్థులు



సికెదిన్నె, జూలై 25: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని.. వాటి సాధనకు కృషి చేయాలని అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. కడప నగరం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా తమ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ఇంజనీరింగ్ విద్యలో అనేక అవకాశాలు ఉన్నాయని.. తల్లిదండ్రులు మంచి కళాశాలను ఎంపిక చేసుకోవడంలో వారి విజయం సగం సాధించినట్లు అన్నారు. విద్యాసంస్థల వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువ ఇంజనీర్ల పాత్ర కీలకమని.. ఎంత కష్టపడి చదివితే అంతకు రెట్టింపు ఫలితం ఉంటుందన్నారు. నాలుగు సంవత్సరాలు కష్టపడి 80 సంవత్సరాలు సుఖంగా జీవించాలని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించేందుకు అర్హత, అనుభ వం కలిగిన అధ్యాపక సిబ్బందిని నియమించామన్నారు. ఏవో రామసుబ్బారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం..

కమలాపురం రూరల్, జూలై 25: మండల పరిధిలోని నసంతపురం గ్రామంలో ఈ నెల 6న వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వ్యాధులు ప్రబలకుండా కొంత మంది చిన్నారులకు టీకాలు వేశారు. ఆ సందర్భంలో రెండు నెలల చిన్నారికి టీకా వేయగా మృతి చెందిన సంఘటన విదితమే. జరిగిన సంఘటనపై కేంద్ర ప్రభు త్వ ఆదేశాల మేరకు గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసరు డాక్టర్ ఉమామహేశ్వర్ నేతృత్వంలో రిమ్స్‌కు చెందిన ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్‌సీహెచ్ రాజేష్‌క్రిష్ణ, డాక్టర్ ఎస్.నాగసుధారాణి, డాక్టర్ ఎస్.సుధాకర్, డాక్టర్‌వి.లక్ష్మీదేవి, డాక్టర్ ఎస్ఎండీ సాజిద్‌బాషాల బృందం నసంతపురం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాలునికి వ్యాక్సిన్ వేయకముందు, వేసిన తరువాత జరిగిన పరిణామాలను తల్లిదండ్రులు అనిత, రాజు ఇతర కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐవో ఉమామహేశ్‌కుమార్ మాట్లాడుతూ బాలుడి మృతిపై విచారణ చేశామని, నివేదికను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దచెప్పలి మెడికల్ ఆఫీసరు ప్రసూన, డ్రగ్స్ ఇన్స్‌పెక్టరు మాధవీ, ఎపిడమయోలజిస్ట్ ఖాజామొహిద్దీన్, సీహెచ్ మునిరెడ్డి పాల్గొన్నారు.



మృతి చెందిన బాలుని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విచారణ బృందం

అంటువ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

● డాక్టర్ వినోద్‌కుమార్


మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి వినోద్‌కుమార్

రామాపురం, జూలై 25: ప్రస్తుత సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ చీకటివాండ్లపల్లెలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జ్వరాలు ప్రబలి అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న వారికి చికిత్సలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు ఉండాలని, కాచిన వేడి నీళ్ల, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఇల్లు తిరిగి మురికి కుంటల్లో బ్లీచింగ్ పౌడర్, శానిటైజర్ చల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

● డీఈవోకు యూటీఎఫ్ నేతల వినతి


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటిటౌన్,జూలై 25: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్ జాబీర్‌లు డిమాండ్ చేశారు. గురువారం వారు యూటీఎఫ్ నేతలతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ జీవో 117 రద్దు చేసి జీవో 53 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ప్రీ ప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి దావుద్దీన్, ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హఫీజుల్లా, రాజారమేశ్, వీరబల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగార్జున, అమీనుల్లా పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

● జేసీని కలిసిన ఎస్ఎన్ కాలనీ వాసులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 25: పట్టణంలోని పెమ్మాడపల్లి రోడ్డు మార్గంలో వున్న సర్వే నెంబరు 801-1లో విస్తీర్ణం 6.80 సెంట్లు డీకేటీ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, దీన్ని వెంటనే ఆపాలని జాయింట్ కలెక్టర్‌కు ఎస్ఎన్ కాలనీ వాసులు గురువారం ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా హిందువులు ఆ శ్మశానవాటికలో చనిపోయిన వారికి అంత్యక్రియలు చేస్తూ వుండేవారని, దాన్ని అప్పుడు కొందరు రియల్ ఎస్టేట్ చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో కూడా ఈ విషయంపై పెద్ద ఎత్తున గందరగోళం నెలకొందని వివరించారు. ఈ విషయంపై ప్రజా సమస్యల వేదికలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు వాపోయారు. ఈ విషయంపై కలెక్టర్ సీరియస్‌గా తీసుకొని శ్మశానవాటికను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు కోరుకోంటున్నారు.

బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి


వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న దృశ్యం

సంబేపల్లె, జూలై 25: క్షయ వ్యాధి నిర్మూలనకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ తప్పక వేసుకోవాలని హెచ్ఐవీ, టీబీ పర్యవేక్షకుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం గున్నికుంట్ల గ్రామం కత్తివాండ్లపల్లెలో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వృద్ధురాలిని పరీక్షించి మందులను సక్రమంగా వాడేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ గంగన్నయాదవ్, హెల్త్‌అసిస్టెంట్ రవిశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 25: జిల్లాలోని నిరుద్యోగులకు రాయచోటి కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 46 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ మేరకు ఎల్ఐసీ, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీ వారు ఇంటర్వ్యూలు నిర్వహించి 23 మందిని ఎంపిక చేసినట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎంప్లాయీస్, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దర్గా స్వామీజి 94వ జయంతి

రామాపురం, జూలై 25: మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపాన గల శ్రీసాయినగర్‌లో వెలసిన దర్బారు దర్గా స్వామిజీ 94వ జయంతి శుక్రవారం నిర్వహిస్తున్నట్లు భక్తులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జయంతి ఉత్సవాలకు మండలంలోనే కాకుండా జిల్లా స్థాయిలో భక్తులు అధికంగా హాజరవుతారని కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం మహాసమాధికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించి అనంతరం ఉత్సవానికి వచ్చే భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు.

పారిశుధ్య సమస్యపై దృష్టి పెట్టండి

● మున్సిపల్ అధికారులకు రాహుల్‌రెడ్డి సూచన

రాయచోటిటౌన్, జూలై 25: రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొని ఉన్న పారిశుధ్య సమస్యపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలని టీడీపీ యువనేత మండిపల్లి రాహుల్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ వాసుబాబుతో కలిసి రాయచోటి పట్టణంలోని సింగపూర్‌లైన్, ఇందిరమ్మకాలనీల్లో సమస్యలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, మాజీ కౌన్సిలర్ అమర్‌నాధ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో వసంతోత్సవం


వసంతోత్సవ కార్యక్రమంలో ఊరేగుతున్న స్వాములు

రాజంపేట, జూలై 25: తాళ్లపాక గ్రామంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వాములకు వేడుకగా వసంతోత్సవ కార్యక్రమాన్ని అత్యంత రమనీయంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని వసంతోత్సవాల్లో భాగంగా సిద్దేశ్వర, చెన్నకేశవుల స్వాములను ప్రత్యేకంగా అలంకరించి తాళ్లపాక పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సిద్దేశ్వరస్వామికి త్రిశూల స్నానం, చెన్నకేశవస్వామికి చక్రస్నానాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళ సిద్దేశ్వర, చెన్నకేశవస్వాముల వారితో ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక దేవాలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామి, గ్రామ సర్పంచ్ గౌరీశంకర్, టీటీడీ దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, ఆర్.స్వామి నాయక్, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, గ్రామ పెద్దలు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'అక్రమాలను వెలికితీయాలి'

లక్కిరెడ్డిపల్లె, జూలై 25: మండలంలో గత 10 ఏళ్లుగా ఉపాధి హామీపథకంలో ఫీల్డు అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడ్డారని, వీటిని జిల్లా ఉన్నతాధికారులు వెలికితీయాలని ఏపీఐఐసీ జోనల్ మాజీ చైర్మన్ యర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన విలేకర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు రజాక్, పీరయ్య, వెంకటరమణ, రవిశంకర్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర మహోత్సవం

సిద్దవటం, జూలై 25: మండలం మాధవరం-1 పంచాయతీ పార్వతిపురంలో వెలసిన శీతలగంగమ్మ అమ్మవారి 21వ జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ పూజారి అమ్మవారికి నిమ్మకాయలతో తయారు చేసిన దండ, పలురకాల పుష్పమాలలు వేసి అత్యంత సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి: ఏఐటీయూసీ

రాయచోటిటౌన్, జూలై 25: విశాఖపట్నంలో సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్బంధాల్ని, ఎస్మాలను తలదన్ని సమ్మె చేశారని, సమ్మె కాలపు హామీలను టీడీపీ కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్, జిల్లా కమిటీ సభ్యులు దేవేంద్ర, వెంకటేశ్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు హార్టిసెట్ పరీక్ష

రైల్వేకోడూరు, జూలై 25: మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన విశ్వవిద్యాలయంలో శుక్రవారం హార్టిసెట్-2024 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ కే.గోపాల్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ ప్రవేశ పరీక్ష కోసం 67 మంది రిజిష్టర్ చేయించుకున్నారని తెలిపారు. హాల్ టిక్కెట్లు అందని వారు కళాశాలలో గుర్తింపు కార్డు చూపించి డూప్లికేట్ హాల్ టిక్కెట్ తీసుకోవచ్చని తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు నిర్ణీత సమయం కన్నా అరగంట ముందే పరీక్షా కేంద్రం చేరుకోవాలని సూచించారు.

ఓబిలిలో వైభవంగా గంగమ్మ జాతర

పెనగలూరు, జూలై 25: మండంలోని ఓబిలి గ్రామంలో 40 ఏళ్ల తర్వాత జరిగిన గంగమ్మ జాతర గురువారం గ్రామంలో వైభవంగా జరిగింది. సంప్రదాయాలను ఆచరిస్తూ గ్రామ పెద్దలు జాతరను నాలుగు రోజుల పాటు జరుపుకోవటం విశేషం. ఓబిలి గ్రామంతో పాటు అతిగారిపల్లె, హరిజనవాడ, ఓదేటివారిపల్లె, జడావారిపల్లె, హరిజనవాడ, కుడప అరుంధతివాడ, దిగువరాచపల్లె, బీసీ కాలనీలు ఈ పంచాయతి పరిధిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, సతీమణి వరలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకున్నారు.

సబ్‌కలెక్టర్‌ను సన్మానించిన టీడీపీ నేతలు



సబ్‌కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

రాజంపేట, జూలై 25: రాజంపేట నూతన సబ్‌కలెక్టర్‌గా వైఖోమ్ నిధి యాదేవి బాధ్యతలు చేపట్టారు. ఆమెను గురువారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య, పలువురు నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటి పరిధిలోని పలు వీధులు మురికికూపంగా మారాయని, మున్సిపాలిటి కమిషనర్ పారిశుధ్య విషయంపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. దోమల నియంత్రణ కోసం పట్టణంలో ఫాగింగ్, కాలువల పూడికతీత చర్యలు పూర్తిగా మరిచారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు పంచాల్సిన భూములు సైతం వైసీపీ ప్రధాన నాయకుల చేతుల్లో ఉన్నాయన్నారు. దీనికి సబ్‌కలెక్టర్ స్పందిస్తూ త్వరలోనే రెవెన్యూ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి సమీక్షిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన జనసేన నాయకుడు

ఒంటిమిట్ట, జూలై 25: రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకుడు శివప్రసాద్ కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలెక్టరేట్‌లో గురువారం కలిశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మెరుగైన మౌలిక వసతులు, ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధికి సహకరించాలని చర్చించారు.

అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారి కొండయ్య

రాజంపేటటౌన్, జూలై 25: అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం రాజంపేట మండల పరిధిలోని ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా, అనీమియా, ఇమ్యునైజేషన్, గర్భిణీలు, బాలింతల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామాల్లో నిర్వహించాల్సిన నీటి పరీక్షలపై వారితో సమీక్షించారు. ప్రతిఒక్కరూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగే విధంగా సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, అశ్వినిచంద్ర, బ్రహ్మేంద్ర, రాజమ్మ, సీహెచ్‌ఓ సిద్దరామయ్య, రవికుమార్, ఆరోగ్య కార్యకర్తలు, ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రెమ్యూనరేషన్ చెల్లించండి : ఏపీటీఎఫ్

రాయచోటిటౌన్, జూలై 25: సప్లమెంటరీ పరీక్షల స్పాట్ వాల్యూయేషన్‌కు వెళ్లిన ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ 257 ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు హరిబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలూనాయక్, చక్రవర్తి కాళిదాస్, సెక్రటరి శ్రీనివాసులతో కలిసి డీఈవో శివప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి సప్లమెంటరీ స్పాట్ వాల్యూయేషన్‌కు కేటాయించబడిన డబ్బులు ఇంకా ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులకు అందలేదన్నారు. అంతేగాక ఎస్ఎస్‌సీ సప్లమెంటరీ పరీక్షలు జరిగి మూడు నెలలవుతున్నా పేపర్ వాల్యూయేషన్ డబ్బులు చెల్లించకపోవడంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నెలవారి ప్రమోషన్‌లో భాగంగా ఉపాధ్యాయులకు వెంటనే ఆయా సబ్జెక్టుల్లో ఖాళీలకు అనుగుణంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

దళిత రైతుల సమస్యలు పరిష్కారం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి


రైతుల పట్టాలను పరిశీలిస్తున్న సుగవాసి

సిద్దవటం, జూలై 25: దళిత రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలియజేశారు. మాధవరం గ్రామ పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్‌లో నివాసం ఉన్న నిరుపేద ఎస్సీ కుటుంబాలకు చెందిన మహిళలు వారి భూ సమస్యలపై గురువారం ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన ఆయన దళిత రైతుల భూములను ఇప్పించేలా చర్యలు తీసుకుని సమస్య పూర్తయ్యేలా చూస్తానని, మీ సమస్య పరిష్కారం కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మాధవరం గ్రామంలోని నూతన వస్త్ర దుకాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

4 వేల వాటర్ ప్యాకెట్లు సీజ్

రాయచోటిటౌన్, జూలై 25: రాయచోటి పట్టణంలో కొంత మంది వాటర్‌ప్లాంట్ యజమానులు గురువారం ఆటోల ద్వారా దుకాణాలకు సరఫరా చేస్తున్న సుమారు 4 వేల వాటర్ ప్యాకెట్లను మున్సి పల్ అధికారులు సీజ్ చేసి.. చెత్తసేకరణ ట్రాక్టర్ ద్వారా కంపోస్టుయార్డుకు తరలించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఆటో యజమానులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు ఫుడ్ సేఫ్టీ అధికారుల అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లలో తినే, తాగే వస్తువులు ప్యాక్ చేసి క్రయ, విక్రయాలు జరిపితే ఆహార భద్రత చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల దోపిడీని అరికట్టాలి

రాయచోటిటౌన్, జూలై 25: రాష్ట్రంలో ప్రైవేటు బస్సుల దోపిడీని అరికట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు బస్సుల దోపిడీ నానాటికీ పెరుగుతోందని, ప్రైవేటు ట్రావెల్స్ ఆపరేటర్లు డిమాండ్‌ను బట్టి టికెట్ల ధరలు పెంచేస్తున్నారని, విమాన చార్జీలకు తీసిపోనట్లుగా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని, తనిఖీ చేయాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇక వీకెండ్, పండుగల సీజన్‌లో టికెట్ చార్జీలు అధికంగా పెంచేసి దండుకుంటున్నారన్నారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో ఆయన కోరారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ


పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

ఒంటిమిట్ట, జూలై 25: మండల కేంద్రంలోని స్థానిక పోలీసుస్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పోలీసుస్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలోని శాంతి భద్రతలు, ఇసుక అక్రమ రవాణా, మద్యం అక్రమ సరఫరా, మిస్సింగ్ కేసులపై వేగవంతం చేయాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులపై ఫిర్యాదులు ఉన్నాయని, వాటిపై నిఘా పెట్టాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితుల సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని పరిష్కరించాలని ఆయన తెలియజేశారు. పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన సమయంలో సీఐ, ఎస్ఐ లేరు. సమాచారం అందుకున్న వెంటనే హుటాహుటిన పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు సంఘాల మహిళలకు వ్యక్తిగత రుణాలు : డీఆర్‌డబ్ల్యూ

పుల్లంపేట, జూలై 25: డ్వాక్రా సంఘాల మహిళలకు సంఘాల ద్వారా ఇచ్చే రుణాలతో పాటు అదనంగా ఉమెన్ లైవ్ లి ఎంటర్‌ప్రైజస్ కింద వ్యక్తిగత రుణాలు ఇస్తున్నట్లు డీఆర్‌డబ్ల్యూ ఏపీడీ సత్యనారాయణ తెలిపారు. పుల్లంపేటలోని స్త్రీ శక్తి భవనంలో గురువారం నియోజకవర్గంలోని ఐదు మండలాల వెలుగు సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలాల వారీగా డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇస్తున్న రుణాల చెల్లింపులు ఏవిధంగా ఉన్నాయో సమీక్ష జరిపారు. మహిళలకు వ్యక్తిగత రుణాలు అందించి వారిని పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అకౌంట్ బీపీఎం ప్రసాద్‌రెడ్డి, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించండి

● టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు పటాన్ మౌలా


పుత్తాను కలిసిన పటాన్ మౌల

రైల్వేకోడూరు(రూరల్), జూలై 25: పార్టీ కోసం నిరంతరంగా కష్టపడిన కార్యకర్తలను గుర్తించి వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చి గుర్తించాలని టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు పటాన్ మౌలా తెలిపారు. గురువారం టీడీపీ సీనియర్ నాయకుడు పుత్తా నరసింహారెడ్డిని కమలాపురం నియోజకవర్గంలోని ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలో కింగ్ మేకర్‌గా ఉన్న స్వర్గీయ కట్టా నారాయణ నాయుడు సమయం నుంచి నేడు ముక్కా రూపానందరెడ్డి వరకు 20 ఏళ్లుగా పార్టీ కోసం నిరంతరంగా సేవలందించానని తెలిపారు. వైసీపీ నాయకులు ఎన్నో ప్రలోభాలకు గురి చేసినా, ఇబ్బందులు పెట్టినా పార్టీని విడిచిపెట్టలేదని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు ఇచ్చి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరినట్లు తెలిపారు.

గిరిజనులకు సంక్షేమ పథకాలు వర్తించవా

● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటిటౌన్, జూలై 25: గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవా అని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు.


సమస్యలను తెలుసుకుంటున్న శ్రీనివాసులు

గురువారం ఆయన రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామ పంచాయతీ ఎస్టీ కాలనీలో నివసిస్తున్న గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీకి పక్కనే ఉన్న ఈ గిరిజన కాలనీలోని పేద ప్రజలకు నివాస స్థలాలు, పక్కా గృహాలు, అర్హులైన వారికి పించన్లు రాకుండా అక్కడున్న అగ్రకులాల వారు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ కాలనీలో సుమారు 100 కుటుంబాల గిరిజనులు నివసిస్తున్నా వారిని పట్టించుకొనే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ శాఖ కార్యదర్శి సుబ్బమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలి


విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా వివరిస్తున్న గెస్ట్ లెక్చరర్

రాజంపేట, జూలై 25: మండల పరిధిలోని బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 3ఎస్ ప్రిఫ్యాబ్ బిల్డింగ్ సిస్టం అనే అంశంపై గెస్ట్ లెక్చరర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే వారి అనుభవాలను వివరించేందుకు గెస్ట్ లెక్చరర్‌గా జె.క్రాంతికుమార్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సీపీడబ్ల్యూడీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఎన్ఐటీ తాడేపల్లెగూడెం కళాశాల కన్‌స్ట్రక్షన్‌ను 3ఎస్ ప్రిఫ్యాబ్ బిల్డింగ్ సిస్టంను ఉపయోగించి ఎలా నిర్మించాలో వివరంగా పేపర్ ప్రెజెంటేషన్, వీడియో ద్వారా తెలియజేశారు. అలాగే ఈఎస్ఈ, గేట్ వంటి పరీక్షల్లో మంచి ర్యాంకు ఎలా సాధించుకోవాలో వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు నూతన కట్టడాల పద్ధతులను తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.నరేష్‌కుమార్, కోఆర్డినేటర్ బి.రఘునాధ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట

● బీజేపీ మహిళమోర్చ జిల్లా అధ్యక్షురాలు సునీత

రాజంపేటటౌన్, జూలై 25: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట వేయడం హర్షించదగ్గ విషయమని బీజేపీ జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు సునీత, నారాయణవర్మలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2024-25 వార్షిక బడ్జెట్‌లో మహిళలు, బాలికల సంక్షేమ అభివృద్ధి కోసం రూ.3 లక్షల కోట్లకు పైగా కేటాయించినట్లు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

గాలివీడు, జూలై 25: పసిపిల్లలు, గర్భవతులు, బాలింతలు తప్పకుండా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. ఆమె గురువారం మండలంలోని తూముకుంట పంచాయతీలో అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పసిపిల్లలకు గర్భవతులకు పౌష్టికరమైన ఆహారాన్ని అంగన్వాడీల ద్వారా అందించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్, అన్నప్రసన్నం, గర్భవతులకు సీమంతాలు జరిపించారు. డయేరియా వ్యక్తిగత పరిశుభ్రత గురించి తల్లులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ సోనీ, టీచర్లు పాల్గొన్నారు.

'అత్యాచారాలను అరికట్టండి'

చిట్వేలి, జూలై 25: రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టాలని సీఐటీయూ, అఖిలభారత ప్రజా సంఘాల (ఐద్వా) ఆధ్వర్యంలో గురువారం మండలంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలపై దాడులు అనేక రూపాల్లో జరుగుతున్నప్పటికి అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జాన్‌ప్రసాద్, సీఐటీయూ మండల కార్యదర్శి సుజాత, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ పెంచలయ్య, ఐద్వా మండల నాయకులు నందు, లీలమ్మ, శంకరమ్మ, పద్మ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి కృషి: ముక్కా వరలక్ష్మి

పెనగలూరు, జూలై 25: మండలంలోని ఓబలి గ్రామంలో ఉన్న పురాతన శివాలయాన్ని అభివృద్ధి పరిచేందుకు ముక్కా చారిటుబల్ ట్రస్టు తరఫున తమ కుటుంబ సభ్యులు సహాయ సహకారాలు అందిస్తారని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ అన్నారు. గురువారం ఓబిలిలో జరిగిన గంగమ్మ జాతరలో పలువురు టీడీపీ, జనసేన అభిమానులు, అనుచరుల ఇళ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు పురాతన శివాలయంలో వద్దకు తీసుకెళ్లి దేవాలయం దుస్థితి గురించి వివరించారు. కార్యక్రమంలో ఆమె వెంట టీడీపీ, జనసేన నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, కొప్పోలు విజయభాస్కర్‌రెడ్డి, న్యాయవాది జి.రెడ్డయ్య, డి.యానాదయ్య, గంగయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీలో టీడీపీ కార్యకర్త మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను ముక్కా వరలక్ష్మీ పరామర్శించారు. కమ్మపల్లె గ్రామానికి చెందిన చిన్నసుబ్బయ్యనాయుడు మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నాగేంద్రనాయుడు, గజేంద్రనాయుడు, రామక్రిష్ణనాయుడు, టి.ఈశ్వర్‌నాయుడు, యువ నాయకులు కోటేశ్వర్‌నాయుడు, ఎన్.నిఖిల్, వేణుగోపాల్‌రెడ్డి, విజయనాయుడు, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్‌లో అలరించిన విద్యార్థులు

నందలూరు, జూలై 25: నూతన జాతీయ విద్యావిధానం 2020 అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందోత్సాహాల నడుమ పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వారోత్సవాల్లో నాలుగో రోజు గురువారం విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. భరతమాత, గాంధీ మహాత్ముడు, జవహర్‌లాల్ నెహ్రూ తదితర వేషాలతో ప్రదర్శనలు ఇచ్చారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మీరు డబ్బు డిపాజిట్ చేయండి. 30 రోజుల్లో రెండింతలు పొందండి.

.. ఇదీ డాయ్ యాప్ పేరిట సాగిన ప్రచారం. ఏజెంట్ల ద్వారా డబ్బులు సేకరించారు. వారి సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. యాప్‌ను ఓపెన్ చేయగానే అందులోని తమ వ్యాలెట్‌లో నగదు కనిపించడం చూసి నమ్మారు. చివరకు సెల్‌ఫోన్లలో ఆ యాప్ కనిపించకపోవడంతో పలమనేరులోని బాధితులు లబోదిబోమంటున్నారు. గతంలో ఇలాంటి మోసాలు సంస్థల తరపున జరగ్గా ఇప్పుడు యాప్‌ను తీసుకొచ్చారు.

- పలమనేరు

ఆశపెట్టి.. మోసగించి



- డిపాజిట్లపై రెండింతలు చెల్లిస్తామంటూ ప్రచారం
- రూ.వంద కోట్లకుపైగా కుచ్చుటోపీ
- పలమనేరులో 'డాయ్ యాప్' కలకలం
- లబోదిబోమంటూ డీఎస్పీ కార్యాలయానికి పరుగుతీసిన బాధితులు

పలమనేరులో గురువారం 'డాయ్ యాప్' మోసం కలకలం సృష్టించింది. ఐదారు నెలలుగా గుట్టు చప్పుడు కాకుండా రూ.వంద కోట్లకుపైగా డిపాజిట్లు సేకరించిన ఈ యాప్.. ఒక్కసారిగా సెల్‌ఫోన్లలో కనిపించక పోవడంతో వందలాది మంది బాధితులు డీఎస్పీ కార్యాలయానికి చేరుకోవడంతో ఈ మోసం వెలుగు చూసింది. ఈ డాయ్ యాప్‌ను మెప్మాలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రాజేష్ ప్రజల్లోకి తీసుకొచ్చారు. మెప్మాలో పనిచేసే పలువురు ఆర్.పి.ల ద్వారా స్వయం సహాయక సంఘ మహిళలు, వారి కుటుంబీకులు, బంధువర్గాలను ఇందులోకి లాగారు. డాయ్ యాప్‌లో డిపాజిట్లు కట్టించారు. ప్రతి పది మంది వద్ద డిపాజిట్లు కట్టించేవారికి ఆశాజనకంగా కమీషన్లు అందించారు. నెలసరి జీతాలూ ఉంటాయని నమ్మించారు. దీంతో ఎందరో ఏజెంట్లుగా మారి డబ్బులు కట్టించారు. 30 రోజులకే రెండింతలు వస్తుందన్న ఆశతో జనమూ యాప్ వలలో పడ్డారు. రూ.వేలల్లో నుంచి రూ.ఐదు లక్షల వరకు పలువురు జమ చేశారు. తాము కట్టిన డబ్బులు మూడో రోజుకే ఆయా వ్యక్తులకు జమ చేసినట్లు డాయ్ యాప్‌లోని వారి ఖాతాలో చూపారు. అంటే.. గడువు తీరాక బ్యాంకు ఖాతాలోకి విత్‌డ్రా చేసుకోవచ్చని నిర్వాహకులు చెప్పారట. ప్రతి రోజూ డబ్బులు డాయ్ యాప్‌లో కనిపిస్తుండటంతో ప్రజలు బాగా నమ్మేశారు. ఇందులో తొలుత కట్టిన వారికి కొంతమేర డబ్బులు వచ్చాయి. ఇదంతా ఆ నోట.. ఈ నోట విని మరికొందరూ అప్పుచేసి కట్టారు. 'ఇలా డిపాజిట్లు చేసిన వారిలో పోలీసులు, రెవెన్యూ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులూ ఉన్నారు. అందువల్లే మేమంతా దీనిని నమ్మి మోసపోయాం' అని కొందరు బాధితులు వాపోయారు. కాగా, డీఎస్పీ విష్ణురఘువీర్ కార్యాలయం నుంచి వెలుపలకు వచ్చి బాధితుల గోడు విన్నారు. డబ్బు చెల్లించే ముందు ఎవరైనా లిఖిత పూర్వకంగా గ్యారెంటీ ఇచ్చారా అని బాధితులను ప్రశ్నించగా.. అలాంటిది లేదన్నారు. తామంతా మెప్మా రాజేష్, ఆర్పీలు చెప్పిన మాటలు విని డబ్బు చెల్లించామని చెప్పారు. ఒక నెలలో రెట్టింపు డబ్బులు ఎలా చెల్లిస్తారని ఆలోచించకుండా అత్యాశకు పోయారని, ఇకపై ఇలాంటి యాప్‌ల బారిన పడి మోసపోవద్దని హెచ్చరించారు. వివరంగా ఫిర్యాదులు ఇస్తే కేసు దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, తాము మోసపోయిన విషయం బయటకు చెప్పుకోలేని వాళ్లెందరో ఉన్నారు. మొత్తమ్మీద యాప్ పేరిట రూ.వంద కోట్ల మోసం జరిగినట్లు తెలిసింది.



తన కార్యాలయం ముందు గుమికూడిన డాయ్ యాప్ బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ

బాధితుల గోడు

రూ.3.5 లక్షలు నష్టపోయా



తొలుత రూ.రెండు లక్షలు కట్టాను. రోజూ కొంత డబ్బు వచ్చేది. ఇలా వచ్చే బోనస్‌కు ఆశపడ్డా. మళ్లీ మరో రూ.లక్ష కట్టాను. మళ్లీ మరో నెంబరు పేరుతో రూ.59 వేలు కట్టాను. ఇలా దాదాపు రూ.3.50 లక్షలు నష్టపోయా.

- లోకేష్‌కుమార్

ఈ నీళ్ల బాటిల్ ఇచ్చారు



మెప్మా రాజేష్ సార్ మీటింగ్ పెట్టి ఆర్.పి.ల ద్వారా అందరి వద్ద డబ్బులు కట్టించారు. తొలుత డబ్బు చెల్లించిన వారికి ప్రోత్సాహకంగా నీళ్ల బాటిళ్లు ఇచ్చారు. దీంతో మేమంతా నమ్మి డబ్బు కట్టాం. ఇకముందు ఎవరూ ఇలాంటి వాటిని నమ్మొద్దు.

- బుజ్జమ్మ

పక్కన వాళ్లను చూసి నేనూ కట్టా



మా ఇంటి పరిసరాల్లోని మహిళలు బంగారు తాకట్టు పెట్టి డబ్బులు కట్టారు. ఉద్యోగులు కూడా డిపాజిట్లు చేయడంతో నేనూ నమ్మి 15వేలు చెల్లించా. భర్తలకు తెలియకుండా వేలాది మహిళలు డబ్బులు కట్టారు. ఈ విషయం ఇంట్లో తెలిస్తే గొడవలవుతాయని బయటకు రాలేదు.

- షామీర్, గంటావూరు



ఎక్కువమందితో డబ్బులు కట్టించిన ఏజెంట్‌కు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న మెప్మా రాజేష్ (ఫైల్ ఫొటో)

రూ.లక్ష చెల్లించి మోసపోయా



నాకు ఉద్యోగం లేదు. డబ్బుకు ఆశపడి దాదాపు లక్ష రూపాయలు చెల్లించి మోసపోయాను. నేను డబ్బులు సంపాదిస్తున్నానని భావించి నన్నుచూసి చాలామంది డబ్బులు కట్టారు. వాళ్లూ మోసపోయారు.

- నవాజ్

అంతా రాజేషే చేశాడు



డాయ్ యాప్‌కు సూత్రధారి మున్సిపాలిటీలో పనిచేసే మెప్మా రాజేష్. మేమంతా మోసపోవడానికి అతడితో పాటు కొంతమంది ఆర్.పిలు కారణం.

- బాబు

నగలు కుదువపెట్టి..



నేను ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నా. గొబ్బిళ్లకోటూరుకు చెందిన నా స్నేహితుడు డబ్బులు కట్టాడు. నెలరోజుల్లో రెట్టింపు డబ్బులు వస్తాయని నేనూ నగలు కుదువపెట్టి రూ.40 వేలు కట్టినా. సెల్‌ఫోన్‌లో యాప్ కనిపించక పోవడంతో మోసపోయానని గుర్తించా.

- రాజన్న

12 కిలోల మారవ చేప



సదుంలోని కుమారుని ఒడ్డు చెరువులో గురువారం 12 కిలోల మారవ చేప దొరికింది. ఇక్కడి జాలర్ల వలకు ఈ పెద్ద చేప చిక్కింది. దీనిని స్థానికులు ఆసక్తిగా చూశారు. చెరువులో నీళ్లు మరింత తగ్గితే ఇంకా పెద్ద చేపలు దొరుకుతాయని తెలిపారు.

- సదుం

టమోటా ధరలు పతనం



టమోటా ధరలు భారీగా తగ్గు ముఖం పట్టాయి. గురువారం 15 కిలోల బాక్సు కేవలం రూ.300, 250కు చేరింది. నాణ్యత ఉన్న టమోటా 15 కిలోల బాక్సు 250 మాత్రమే పలికింది. మిగిలిన రకాలు రూ.200. వారం కిందట ఒక బాక్సు రూ.700, 800 పలికింది. శనివారం రూ.600కు, సోమవారం రూ.500, బుధవారం రూ.400కు గురువారం రూ.200కు చేరుకుంది. ఇలా రోజు రోజుకు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని టమోటా మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. అనంతపురం జిల్లా, ఇతర రాష్ట్రాల్లో టమోటా దిగుబడులు పెరిగి అక్కడ ధరలు తక్కువగా ఉండడంతో వ్యాపారులు అటు వెళ్లారు. దీంతో జిల్లాలోని మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు తెలిపారు.

- సోమల

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.24 కోట్లు



హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జూలై 25: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,24,41,336 లభించింది. గురువారం ఆలయ ఆస్థాన మండపంలో కానుకలను ఈవో వెంకటేశు ఆధ్వర్యంలో లెక్కించారు. ఇందులో 1,256యూఎస్ఏ, 20 ఆస్ట్రేలియా, 4 సింగపూర్, 25 కెనడా డాలర్లు, 6 మలేసియా రింగిట్స్, 15 యూరోలు, 20 యూఏఈ దిర్హామ్స్, 10 ఇంగ్లండ్ పౌండ్లతో పాటు 24 గ్రాముల బంగారు, 440 గ్రాముల వెండి లభించింది. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.9,448, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.30,629 సమకూరినట్లు ఈవో తెలిపారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, బాలరంగస్వామి, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి - అర్ధగిరిలో తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

ఐరాల(కాణిపాకం)/తవణంపల్లె, జూలై 25: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డిలు స్వాగతించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. కాగా అంతకు ముందు ఆమె తవణంపల్లె మండలం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అర్చకులు స్వాగతం పలికి, స్వామి దర్శనం చేయించారు. శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

రాష్ట్ర అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం

కష్టకాలంలో అండగా నిలిచిన మీ క్షేమమే మా కుటుంబ లక్ష్యం ● శాంతిపురం, రామకుప్పం మండలాల్లో భువనేశ్వరి పర్యటన

కుప్పం/శాంతిపురం/ రామకుప్పం, జూలై 25: రాష్ట్రం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం, అందుకే ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని నారా భువనేశ్వరి అన్నారు. కష్టకాలంలో చంద్రబాబుకు, టీడీపీకి అండగా నిలిచిన కుప్పం ఒక వరంలాంటిదన్నారు. అందుకనే నియోజకవర్గ ప్రజల క్షేమసమాచారాలు కనుక్కుని, వారికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమం అందించడానికి తాను స్వయంగా వచ్చానని చెప్పారు. మూడో రోజైన గురువారం ఆమె శాంతిపురం మండలంలోని సోమాపురం, కర్లగట్ట, బడుగుమాకులపల్లె.. రామకుప్పం మండలంలోని ఆవులకుప్పం, నారాయణపురం తాండా, ఆరిమానుపెంట, వీర్నమల గ్రామాలలో పర్యటించారు. మహిళలతో ముఖాముఖి సమావేశమయ్యారు. ప్రజల క్షేమ సమాచారం తెలుసుకున్నారు. కుప్పం ప్రజలకు చంద్రబాబు ప్రత్యేక మ్యానిఫెస్టో ఇచ్చారని గుర్తు చేశారు. దానితోపాటు తన పర్యటనలో గమనించిన సమస్యలను ఆయనవద్ద ప్రస్తావించి పరిష్కారాలు చూపుతామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళలు చంద్రబాబు కష్టకాలంలో ఉన్నప్పుడు రోడ్డుమీదకు వచ్చి ఆందోళనలు చేసి ఆయనకు మద్దతు ప్రకటించడాన్ని తాను మరచిపోలేనన్నారు. వారికి ఆర్థిక స్వావలంబన కలిగించడానికి, వారి కుటుంబాలు బాగుపడడానికి తాను చంద్రబాబు ద్వారా వివిధ పథకాలు అమలు చేయిస్తానన్నారు. కుప్పంలో కార్గో విమానాశ్రయం పూర్తయితే పరిశ్రమలు వస్తాయన్నారు. వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తలు తప్పుడు కేసులు బనాయించినా, మెడమీద కత్తిపెట్టినా ఏమాత్రం బెదరకుండా ఇక్కడి ప్రజలు, కార్యకర్తలు చంద్రబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించారని గుర్తు చేసుకున్నారు. కుప్పం ప్రజల సమస్యలు పరిష్కరించడమే కాకుండా తమకు చేతనైనంతగా సాయం చేస్తానని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. తన కుప్పం పర్యటన వెనుక ఎటువంటి రాజకీయ ఉద్దేశం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాదు ఐటీని చంద్రబాబు ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఆ రంగంలో ఎదిగిన ఐటీ నిపుణులు దేశవిదేశాలనుంచి వచ్చి చంద్రబాబు కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయనకు మద్దతుగా నిలబడడం మరువలేని ఘట్టంగా భువనేశ్వరి పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నేతలు డాక్టర్ సురేశ్‌బాబు, గాజుల ఖాదర్‌బాషా, గౌనివారి శ్రీనివాసులు, శాంతిపురం మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ్‌కుమార్, ఎంపీటీసీ నామాలప్ప, యూనిట్ ఇన్‌ఛార్జి నాగభూషణంరెడ్డి, రామకుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, మునస్వామి, నరసింహులు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురం మండలం బడుగుమాకులపల్లెలో మాట్లాడుతున్న భువనేశ్వరి

పంట పొలాలపై ఏనుగుల దాడులు



ధ్వంసం చేసిన కంచె, కూసాలు

ఐరాల,జూలై 25: మండలంలోని వినాయకపురంలో గురువారం మూడు ఏనుగులు మామిడి, ఉసిరి తోటలపై దాడులు చేశాయి. రైతులు పార్వతమ్మ, అమ్ములు, రామకృష్ణారెడ్డికి చెందిన చెందిన మామిడి తోటలను ధ్వంసం చేశాయి. కంచె కూసాలు, బోరు పైపులు విరిచేశాయి. అపోలో ప్రతాప్.సి.రెడ్డికి చెందిన ఉసిరి చెట్లు విరిచివేశాయి. రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

రూ.27 లక్షల మద్యం, సారా ధ్వంసం



మద్యాన్ని నాశనం చేస్తున్న పోలీసులు

యాదమరి, జూలై 25: చిత్తూరు వెస్ట్ సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో సీజ్ చేసిన మద్యం, సారాను పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. వివిధ కేసుల్లో యాదమరిలో 40, తవణంపల్లెలో 8, గుడిపాలలో 68 కేసుల మద్యం, 1,258 లీటర్ల సారాను పోలీసులు పట్టుకున్నారు. రూ. 27లక్షల విలువ చేసే ఈ మద్యం, సారాను చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో యాదమరి సమీపంలోని పెరుమాళ్లపల్లె వద్ద రోడ్డు రోలర్‌తో తొక్కించి నాశనం చేశారు. వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి, సెబ్ ఏఈఎస్ రవి, యాదమరి ఎస్ఐలు రామాంజినేయులు, అనిల్‌కుమార్, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

వరకట్నం కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూలై 25: వరకట్నం కోసం భార్యను వేధించిన భర్తపై పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబులు నాగరాజ కథనం మేరకు..పుంగనూరులోని మేలుపట్లకు చెందిన శంకరప్ప కుమార్తె దివ్యభారతి(29)కి తమినాడు రాష్ట్రం మనవర్‌నగర్ పట్టణంలోని అన్ననగర్‌వీధికి చెందిన శేఖర్ కుమారుడు వినోద్‌కుమార్‌తో గత ఏడాది వివాహమైంది. ఇద్దరూ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. కొంత కాలంగా రూ.5లక్షలు అదనపు కట్నం కావాలని భర్త వేధిస్తున్నట్లు భార్య దివ్యభారతి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత కలెక్టరేట్‌లో భద్రతకు చర్యలు



కిటికీ లేని గదిని పరిశీలిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, జూలై 25: చిత్తూరు నగరం గిరింపేటలోని పాత కలెక్టరేట్‌ను డీఆర్వో పుల్లయ్య గురువారం సాయంత్రం సందర్శించారు. అక్కడి స్థితిగతులను పరిశీలించారు. 'ఇక్కడి రికార్డులకు భద్రత ఉందా' అంటూ గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఈ క్రమంలో డీఆర్వో పాత కలెక్టరేట్‌కు వెళ్లి వందేళ్లకు మించి చరిత్ర కలిగిన రెవెన్యూ రికార్డు భవనాన్ని నాలుగువైపులా పరిశీలించారు. ప్రహరీకి ఏర్పడిన కంతను పూడ్చాలని, అద్దాలు, కిటికీలకు స్వల్ప మరమ్మతులు చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. భవనంపై కూలేస్థితిలో ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించాలని ఆదేశించారు. పాత కలెక్టరేట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు రౌండ్ ది క్లాక్ పోలీసు సెక్యూరిటీ ఏర్పాటు చేయున్నారు. కలెక్టర్‌తో చర్చించి భద్రతాచర్యలు చేపడతామని డీఆర్వో తెలిపారు. రాత్రివేళల్లో మందుబాబులను అరికట్టడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసు సెక్యూరిటీ ఏర్పాటు అంశం చేపడతామన్నారు. బందెలదొడ్డిలా మారిన ట్రెజరీ రికార్డు గదిపై తగు చర్యలు తీసుకోవాలని ఖజానాశాఖ డీడీ రామచంద్రను ఆదేశిస్తామన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా



ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన మైన్స్ అధికారులు

చిత్తూరు (సెంట్రల్), జూలై 25: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై మైన్స్ అధికారులు దృష్టి సారించారు. మైన్స్ జియాలజిస్టు పోలిరెడ్డి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి మూడు రోజులుగా పెనుమూరు, గంగాధరనెల్లూరు, యాదమరి మండలాల్లోని రీచ్‌లు, వంకల ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు. ఎగువన కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాల్లోని వాగులు, వంకలకు ఇసుక చేరింది. దీన్ని కొందరు వ్యక్తులు అనధికారికంగా తరలిస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో మైన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. బుధవారం రాత్రి పెనుమూరు, యాదమరి మండలాల్లో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. దాడుల్లో చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, రూరల్ సీఐ హరికృష్ణ, అర్బన్ సీఐ విజయ్‌కుమార్, మైన్స్ సిబ్బంది పాల్గొన్నారు. పోలిరెడ్డి మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను తొలిసారి సీజ్ చేస్తూ రూ.10 వేలు, రెండోసారి రూ.25 వేలు జరిమానా విధిస్తామని, మూడోసారి ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని తెలిపారు.

రికార్డులు భద్రమేనా..?

- చేతులు కాలాకా ఆకులు పట్టుకుంటే ఏం ప్రయోజనం
- తహసీల్దార్, ఉపాధిహామీ కార్యాలయాల్లో కన్పిస్తున్న నిర్లక్ష్యం
- రెవెన్యూ కార్యాలయంలో మీటరు వద్ద బయటకు కనిపిస్తున్న కరెంటు వైర్లు


ఉపాధి హామీ కార్యాలయంలో గదిలేక సమావేశపు గదిలో ఉన్న మస్టర్లు

ములకలచెరువు, జూలై 25: ములకలచెరువు తహసీల్దార్, గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయాల్లో ఉన్న రికార్డులు భద్రంగా ఉన్నాయానని అనుమానం కలుగుతోంది. ఎక్కడ పడితే అక్కడ రికార్డులు, పత్రాలు ఉండడంతో నిర్లక్ష్యం కన్పిస్తోంది. తహసీల్దార్ కార్యాయంలో సమావేశపు, వీఆర్‌వోల గదుల్లో రికార్డులు ఎక్కడపడితే అక్కడ ఉన్నాయి. వీఆర్‌వోల గదిలో బీరువాలపైన పత్రాలు ఉంచారు. అలాగే కార్యాలయంలోని ఓ గదిలో ఉంచిన సర్టిఫికెట్ల ఓసీ పత్రాలకు ఉన్న చిన్న కిటకీలకు తలుపులు లేవు. ప్రధాన, ముఖ్య రికార్డులు ఉన్న గదికి సమీపంలో వర్షం వస్తే ఉరుస్తుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.


తహసీల్దార్ కార్యాలయం సమావేశపు గదిలో ఉన్న పత్రాలు


తహసీల్దార్ కార్యాలయంలో కరెంటు మీటరు వద్ద ఉన్న వైర్లు

కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద విద్యుత్ మీటర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ మీటరు ఉన్న చోట కరెంటు వైర్లు బయటకు కన్పిస్తున్నాయి. ఈ వైర్లను చూసిన వారు షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదం లేకపోలేదని అంటున్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో మస్టర్లు, పత్రాలు భద్రపరిచేందుకు గది లేకపోవడంతో సమావేశపు గదలో ఉంచారు. దీంతో ఇక్కడ మస్టర్ల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ పథకంకు సంబంధించిన మస్టర్లు కూడా ముఖ్యమైన పత్రాలే. వీటిని భద్ర పరచాల్సిన అవసరం ఉంది. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ పలు చోట్ల దెబ్బతిని నేలమట్టమైంది. ఇక్కడ తహసీల్దార్, ఎంపీడీవో, ఉపాధిహామీ, వెలుగు, సీఎల్ఆర్‌సీ కార్యాలయాలు ఉన్నాయి. ఇన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా ప్రహరీ సరిగా లేకపోవడంతో భద్రత కరువైంది. ఇలా అయితే ముఖ్యమైన రికార్డులు కనిపించకపోయినా, ఎవరైనా అపహరించినా బాధ్యత ఎవరిదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రికార్డులు భద్రపరచాలని పలువురు కోరుతున్నారు.


తహసీల్దార్ కార్యాయంలో రికార్డుల గదిని పరిశీలిస్తున్న సీఐ మధు, ఎస్ఐ తిప్పేస్వామి

ప్రభుత్వ కార్యాలయాల రికార్డు గదుల పరిశీలన

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచన

ములకలచెరువు, జూలై 25: ములకలచెరువులోని ప్రభుత్వ కార్యాలయాల రికార్డుల గదులను గురువారం సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐ తిప్పేస్వామి, ఎంపీడీవో పోలప్పలు పరిశీలించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీవో, ఉపాధి, వెలుగు కార్యాలయాల్లోని రికార్డులు, ముఖ్య పత్రాలు ఉన్న గదులను పరిశీలించారు. భద్రత, కిటకీలు, తలుపులు సరిగా ఉన్నాయా? అని తనిఖీ చేశారు. అలాగే ప్రతి రోజు రాత్రి వేళల్లో ఖచ్చితంగా సిబ్బంది కార్యాలయాల్లో కాపలా ఉండాలని సూచించారు. కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీల్లో డీటీ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డు గదులను తనిఖీ చేసిన పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వాల్మీకిపురం, జూలై 25: ప్రభుత్వ కార్యాలయాలలో రికార్డుల భద్రతపై వాల్మీకిపురం సీఐ పులి శేఖర్ గురువారం తనిఖీలు చేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు' అన్న కథనం పై అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా గురు వారం ఉదయం 10.30గంటలకు స్థానిక సబ్‌రిజస్టర్ కార్యా లయం, తహసీల్దార్ కార్యాలయాలలో రికార్డు గదులను వాల్మీకిపురం సీఐ పులి శేఖర్ తనిఖీ చేశారు. రికార్డు గదు ల నిర్వహణపై అక్కడి సిబ్బందిని అడిగి వివరాలు ఆరా తీశారు. సబ్‌రిజస్టర్ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే కార్యాలయానికి రాత్రి సమయాలలో వాచ్‌మెన్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విలువైన రికార్డుల విషయంలో ఏదైనా జరిగితే కార్యాలయం అధికా రులు, సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కూడా రికార్డు గదులను పరిశీలిస్తూ విధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వాల్మీకిపురం రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శేఖర్

రైతు సమ్మేళన ఉత్సవాలను జయప్రదం చేయండి


రైతుసమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బి.కొత్తకోట, జూలై25: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణంలో ఈనెల 29నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి రైతు సమ్మేళన ఉత్సవాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కిష్టప్ప, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. బి.కొత్తకోట పట్టణంలో గురువారం ఈ సమ్మేళనాలకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడుదశాబ్దాలు దాటిపోతున్నా దేశంలో రైతులు గౌరవప్రదంగా జీవించే పరిస్థితులు లేవని, పాలకుల రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు, కౌలుదారులు, చేతివృత్తులవారు నానాటికీ ఆర్థికంగా చితికిపోతున్నారని అన్నారు. రుణభారంతో రైతులు ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నా , వ్యవసాయ సంక్షోభానికి మూలకారణాలను విశ్లేషించి రైతులను కాపాడటంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్రం మూడు నల్లచట్టాలను తెచ్చి వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెడుతోందని విమర్శించారు. వ్యవసాయ రంగ పరిరక్షణకు రైతులు, వ్యవసాయరంగ మద్దతుదారులందరూ ఈ రైతుసమ్మేళన సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

కార్యక్రమంలో సీపీఐ నాయ కులు అష్రఫ్‌అలీ, రఘునాథ్, నారాయణస్వామి, తంబయ్య శెట్టి, రియాజ్,హబీబ్ పాల్గొన్నారు.

కేవీకే కోఆర్డినేటర్‌గా మంజుల నియామకం



కలికిరి, జూలై 25: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌గా డాక్టర్ కె.మంజు ల నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆమె బాధ్యతలు స్వీకరిం చారు. ఇప్పటి వరకూ పనిచేస్తున్న జీఎస్‌పాండురంగ తిరుపతి వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో మంజుల ను నియమించారు. తిరుపతి శ్రీవెంకటే శ్వర వ్యవసాయ కళాశాలలో అసొసియే ట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ కేవీకే కోఆర్డినేటర్‌గా బదిలీ అయ్యారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో 19 ఏళ్ళుగా వివిధ బాధ్యతలను నిర్వర్తించారు. కాగా కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా జిల్లా రైతులకు చిత్త శుద్ధితో సేవలందిస్తానని డాక్టర్ మంజుల పేర్కొన్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులో 26 మందికి అప్‌డేట్

పెద్దమండ్యం, జూలై 25: పెద్దమండ్యం మండలం కలిచెర్ల పాతూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన ఆధార్ ప్రత్యేక క్యాంపులో 26 మందికి ఆధార్ వివరాల అప్‌డేట్, కొత్త ఆధార్ నమోదు చేసినట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ ప్రత్యేక క్యాంపు ద్వారా పాఠశాల విదార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ నమోదు చేపట్టినట్లు తెలిపారు. కాగా నెట్‌వర్క్ సరిగా లేక ఆధార్ నమోదు అలస్యంగా సాగినట్లు తెలిపారు. అలాగే ఈనెల 26న కలిచెర్ల తెలుగు ప్రాథమిక పాఠశాలలో, 27న కోటకాడపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కలిచర్ల డిజిటల్ అసిస్టెంట్ ఫసుహుద్దీన్ ఆధార్ వివరాలను ఆన్‌లైన్ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వేజర్ నౌజీయ బేగం, ఎన్‌వోపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మీ, జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర వేడుకులు

మదనపల్లె అర్బన్, జూలై 25: స్థానిక నిమ్మనపల్లె సర్కిల్‌లో నడివీధి గంగమ్మను ప్రతిష్ఠించి జాతర వేడుకలను వైభవంగా నిర్వహించారు. గురువారం తెల్లవారు జామునుంచి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకున్నారు. ప్రతి మూడేళ్ళకు ఒకసారీ నడివీధి గంగమ్మ జాతరను నిర్వహిస్తున్నారు.. ఇందులో భాగంగా మహిళలు దీలు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం ఇవ్వండి

పెద్దమండ్యం, జూలై 25: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఇవ్వాలని ఎంపీడీవో వెంకటరమణయ్య పేర్కొన్నారు. మండలంలోని కలిచెర్ల పాతూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు భోజనం సమయంలో నీళ్లు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. పరిశుభ్రతపై కూడా దృష్టి సారించాలన్నారు. ఎన్‌వోపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను దోచుకుంటున్న పాలకులు



ఏపీ మున్సిపల్ వర్కర్స్ సమావేశంలో మాట్లాడుతున్న తులశేంద్ర

బి.కొత్తకోట, జూలై25: దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల శ్రమను కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయ ని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తులశేంద్ర పేర్కొన్నారు. గత రెండురోజులుగా ప్రముఖ పర్యాటక కేంద్రం హార్స్లీ హిల్స్‌లో జరిగిన ఏఐటీ యూసీ అనుబంధ విభాగమైన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలని తులశేంద్ర డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన హక్కుల కోసం ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్‌గౌడ్, రామచం ద్రయ్య, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు రాధాక్రిష్ణమూర్తి, రామారావు, శ్రీనివాసులు, సురేష్ కుమార్, జిల్లాకోశాధికారి సలీంబాషా పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: కార్మికుల చట్టాలతో హక్కులను సాధించుకోవాలని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ అన్నారు. గురువారం హార్స్లీ హిల్స్‌లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన కార్మికుల చట్టాల ద్వారా వారి హక్కులు ఏ విధంగా సాధించు కోవాలో తెలియజేశారు.

ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయండి

పెద్దతిప్పసముద్రం జూలై 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను తక్షణం పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ దాస్, డీఈ వెంకటరెడ్డి, లు సూచించారు. గురువారం ఈఈ, డీఈలు పీటీఎం సమీపంలో జరుగుతున్న హౌసింగ్ కాలనీలో పర్యటించారు. వివిధ దశల్లో నిర్మాణాలను పరిశీలించారు. కాలనీల్లో నిర్మాణాలను వెంటనేపూర్తి చేసేందుకు హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారులకు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగార్జున, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె తహసీల్దారు కార్యాలయం తనిఖీ

తంబళ్లపల్లె, జూలై 25: తంబళ్లపల్లె తహసీల్దారు కార్యాలయాన్ని గురువారం పోలీసులు తనిఖీ చేశారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దహనమైన ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం సీఐ మధు, ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో కలసి తహసీల్దారు కార్యాలయాన్ని క్షుణ్ణంగా తనిఖీచేశారు. కార్యాలయంలో రికార్డులు భద్రపరచే గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మదనపల్లె ఘటన దృష్ట్యా రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రికార్డు రూమును జాగ్రత్తగా నిర్వహించుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులతో పాటు పోలీసుల దృష్టికి తీసుకురావాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జిల్లా సబ్‌జూనియర్ బాలుర ఫుట్‌బాల్ ప్రాబబుల్స్ ఎంపిక


జిల్లా సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన ప్రాబబుల్స్ క్రీడాకారులు

మదనపల్లె టౌన్, జూలై 25: అన్నమయ్య జిల్లా సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ ప్రాబబుల్స్ జట్టును జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఎంపిక చేశారు. గురువారం స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన క్రీడాకారుల ఎంపికలో జిల్లా నలుమూలల నుంచి 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ చూపిన 30 మందిని ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆగస్టులో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తుది జట్టు పాల్గొంటుందని అసోసియేషన్ సభ్యులు దిలీప్, మురళీధర్ తెలిపారు.

విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదగాలి

వాల్మీకిపురం, జూలై 25: విద్యార్థులంతా భావిభారత పౌరులుగా ఎదగాలని వాల్మీకిపురం జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి పేర్కొన్నారు. శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పాఠశాల ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు. జాతీయ విద్యా విధానం 2020 విద్యలో తలా విద్యకు, సాంస్కృతిక విద్యను అంతరభాగం చేశారని తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తల్లులదే సమగ్ర బాలల పరిరక్షణ బాధ్యత

కలికిరి, జూలై 25: చిన్న పిల్లలు మానసికంగా, శారీరకంగా పరిణితి చెందేందుకు తల్లులే బాధ్యత తీసుకోవాలని వాల్మీకిపురం సీడీపీవో భారతి పేర్కొన్నారు. గురువారం కలికిరి పంచాయతీలోని రాజువారిపల్లెలో వంద రోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో సమగ్ర బాలల పరిరక్షణ, శిశు గృహ, గృహ హింస చట్టం గురించి విశదీకరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుంధతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు

మదనపల్లె అర్బన్, జూలై25: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న నూతన క్రిమినల్ చట్టాలపై ఈ నెల 27న ఉదయం 10 గంటలకు మదనపల్లె ఎన్జీవో హోమ్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అఖిలభారత న్యాయవాదుల సంఘం మదనపల్లె కమిటీ నాయకులు గురువారం పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిల భారత న్యాయవాదుల సంఘం మదనపల్లె కమిటీ నాయకులు పీవీప్రసాద్, షాజహాన్, సోముశేఖర్, శ్రీనివాసులు ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు హరిశర్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుల దోపిడీని వెంటనే అరికట్టండి


మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన ఈశ్వరయ్య

మదనపల్లె అర్బన్, జూలై 25: రాష్ట్రంలో నానాటికి పెరిగిపోతున్న ప్రైవేట్ బస్సుల దోపిడీని అరికట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని గురువారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు మంత్రికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రైవేట్ ట్రావెల్స్ డిమాండ్లను బట్టి టికెట్ల ధరలు పెంచేస్తున్నారని ఆరోపించారు. రవాణా శాఖ అనుమతులు లేనప్పటికీ పలు సర్వీసులు నడుస్తున్నాయని, తనిఖీ చేయాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అవసరాలకు అనుగుణంగా ప్రయాణీకులు హెచ్చు రేట్లు పెట్టి ప్రయాణించడం తప్పడం లేదన్నారు. బస్సుల రిజిస్ట్రేషన్ పక్క రాష్ట్రాల్లో చేసుకుని ఏపీలో తిప్పుతున్నారని ఆరోపించారు. పక్క మార్గాలైన పల్లె రూట్‌లో నడుపుతూ టోల్‌గేట్ చార్జీలను కూడా తప్పించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం , రవాణాశాఖ అధికారులు ప్రైవేట్ ఆపరేటర్ల టికెట్ ధరలను నియంత్రించాలని, అడ్డదారుల్లో దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు.

అద్దె బస్సుల్లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వన్‌డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, జూలై 25: స్థానిక వన్ అండ్ టూ డిపోలోని అద్దె బస్సుల్లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి సూచించారు. గురువారం స్థానిక వన్ డిపో కార్యాలయంలో అద్దె బస్సుల యాజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పేర్‌గా టైర్లు ఉంచుకోవాలని, డ్రైవర్లు మద్యం తాగి, సెల్‌ఫోన్లు మాట్లాడుతూ బస్సులు నడపరాదని పేర్కొన్నారు. అన్ని స్టేజ్‌లో బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడంతోపాటు వారి నుంచి ఎలాంటి ఫిర్యాదు లేకుండా చూడాలన్నారు. ఆర్టీసీలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు రేవతి, గీతా, ఎంఎఫ్ రవి, హైర్‌బస్సు యజమానులు పాల్గొన్నారు.

దోచుకున్న భూములను హక్కుదారులకు ఇప్పిస్తాం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తంబళ్లపల్లె, జూలై 25: తంబళ్లపల్లె నియోజకవర్గంలో గత వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని పెద్దిరెడ్డి కుటుంబం పేదల నుంచి కబ్జా చేసిన భూములను ప్రస్తుత కూటమి ప్రభుత్వ సహకారంతో మళ్లీ సొంత హక్కుదారులకే అప్పగిస్తామని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం తంబళ్లపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ...గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో తంబళ్లపల్లె నియోజకవర్గవ్యాప్తంగా పెద్దిరెడ్డి కుటుంబం కొన్ని వందల ఎకరాల భూములను దోచుకున్నారని ఆరోపించారు. ఈ భూ భాగోతం ఎక్కడ బయట పడుతుందనే నెపంతో మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులకు నిప్పు పెట్టి బూడిద చేయించారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి కుటుంబం చేసిన భూ మాఫియా, ఇసుక మాఫియా అవినీతి అక్రమాలను బయటపెట్టి ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పార్లమెంటు బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, జయరాంరెడ్డి, పురుషోత్తం, మూలపల్లె శేఖర, స్వామిరెడ్డి, నాగేంద్ర, మాజీ సర్పంచ్ శంకర, సాంబశివారెడ్డి, ఎమ్మార్పీఎస్ జగదీష్, అల్లావుద్దీన్, రామ్మోహన్‌రెడ్డి, రాజన్న సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.76కోట్లకు చేరిన టౌన్‌బ్యాంకు డిపాజిట్లు


మాట్లాడుతున్న సహకారశాఖ అధికారి రవిచంద్రన్

మదనపల్లె టౌన్, జూలై 25: మదనపల్లె కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు వ్యవస్థాపించిన వందేళ్లలో రూ.76 కోట్ల డిపాజిట్లు సేకరించినట్లు డివిజన్ సహకారశాఖ అధికారి, పర్సన్ ఇన్‌చార్జి రవిచంద్రన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక టౌన్‌బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పాతబ్యాంకుగా టౌన్‌బ్యాంకు నిలిచిందన్నారు. 30 మంది సభ్యులతో ప్రారంభమైన టౌన్‌బ్యాంకులో నేడు 3441 మంది ఏ క్లాస్ సభ్యులు ఉన్నారన్నారు. కరోనా సమయంలో కూడా ఖతాదారులకు సేవలందించామని గుర్తుచేశారు. తమ బ్రాంచిలకు అనుగుణంగానే ఏటీఎంలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. ప్రస్తుతం టౌన్‌బ్యాంకు పాలకవర్గం లేదని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లగా ఆయన సముఖంగా స్పందించారన్నారు. త్వరలో టౌన్‌బ్యాంకు వందేళ్ల ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు సీఈవో పీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలకు జరిమానా తప్పదు

పీలేరు, జూలై 25: గ్రామ పంచాయతీ అనుమతి లేని నిర్మాణాలు, నీటి కొళాయి లకు జరిమానా తప్పదని పీలేరు పంచాయ తీ కార్యదర్శి గురుమోహన్ స్పష్టం చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించి అక్రమ నిర్మాణాలు, అక్రమ నీటి కొళాయిలను గుర్తిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ అనుమతులు లేని నిర్మాణాలు, కొళాయిలకు పంచాయతీ నిర్దేశించిన రుసుములు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని, అలా చేయని వాటిని త్వరలోనే తొలగిస్తామని తెలిపారు. అలాగే పంచాయతీకి చెల్లించాల్సిన నీటి, ఇంటి పన్నులను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీలను బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న దుద్దు రామకృష్ణ మాదిగ

పీలేరు, జూలై 25: ప్రతి మాదిగపల్లెల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీలను పటిష్ఠం చేయడంపై దృష్టి సారించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వాటి అనుబంధ సంఘాల విస్తృత జిల్లా స్థాయి సమావేశం గురువారం పీలేరులోని టీటీడీ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు కున్న యువత, చైతన్యవంతులైన మాదిగలతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీలను పటిష్ఠం చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు గండికోట వెంకటేశ్, పెంచులయ్య, శ్రీనివాసు లు, ముల్లంగి గురవయ్య, దొడ్డి సురేశ్, ముదివేడు శ్రీనివాసులు, విశ్వనాథ, నాగేశ్వరరావు, గంగాధర, కొండప్ప, హుస్సేనయ్య, హరినాథబాబు, నరసింహులు, చరణ్, రెడ్డికుమార్, మేస్త్రి రమణ, రమేశ్, బాలాజీ, శివ, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ కోర్సుకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

తంబళ్లపల్లె, జూలై 25: తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ఉచిత టైలరింగ్ కోర్సుకు ఆసక్తి గల యువతీయువకులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టైలరింగ్ కోర్సు మూడు నెలల పాటు ఉంటుందని.. 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు వారు అర్హులన్నారు. శిక్షణ పూర్తైన అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చన్నారు. ఆసక్తి గల యువతీయువకులు ఆగస్టు 1వ తేదీ లోగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య నెం:9618655759 సంప్రదించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 27వ తేదీ తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ విద్యార్హత ధృవపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది

కలకడ, జూలై 25:విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని కోన హైస్కూల్ హెచ్‌ఎం చెంగల్‌రాయులు అన్నారు. గురువారం బెంగుళూరుకు చెందిన దాత శిబ్బాల రవీంద్ర దంపతులు పాఠశాలకు రూ.15 వేలు విలువైన క్రీడా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన మాజీ సర్పంచ్ బకరం శ్రీనివాసులరెడ్డి తన వంతు సాయంగా పాఠశాల క్రీడా మైదానానికి కొంత భూమిని ఇస్తానని ప్రకటించడం సంతోషకరమని తెలిపారు. మాజీ సర్పంచ్ త్యాగరాజు, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి అధిక నిధులు కేటాయింపుపై హర్షం

పెద్దతిప్పసముద్రం జూలై 25 : కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణానికి రూ. 15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయింపుపై తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ యువనాయకుడు మనోజ్‌జయంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మనోజ్‌జయంత్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించడం హర్షదాయకమన్నారు.